




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 213 పేజీలు : 12, వెల రూ. 5/- శుక్రవారం, సెప్టెంబరు 25, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA


# ఖైరతాబాద్‌లో ఇక ఉప ఎన్నికే!

## దానం నాగేందర్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

- హైకోర్టు అనర్హత వేటును సమర్థించిన ధర్మాసనం
- పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపేనని స్పష్టీకరణ
- ఉపఎన్నికలో పోటీ చేసుకోవచ్చని సూచన
- 3 ప్రధాన పార్టీల మధ్య మళ్లీ పోరు
- టికెట్ కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో ఆశావహులు
- మైనారిటీలు, బస్తీ ఓటర్లపైనే దృష్టి
- గ్రేటర్ రాజకీయాలపై ఫలితం ప్రభావం చూపే అవకాశం



హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ.. ఉప ఎన్నికలో పోటీ చేసుకోవచ్చని సూచించింది. పదవిలో కొనసాగుతూనే పార్టీ మారితే అది ఫిరాయింపేనని స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా స్పష్టత రావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దానం నాగేందర్ సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లినట్లు సమాచారం. మరోవైపు తీర్పుపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. 2024లో కాంగ్రెస్‌లో చేరిన ఆయన అదే ఏడాది సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ మారిన నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంది. దీనిపై దానం సుప్రీంకోర్టును ఆశ్రయించినా.. స్టే లభించలేదు. దీంతో ఇప్పుడు ఖైరతాబాద్ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. సుమారు మూడు దశాబ్దాలుగా హైదరాబాద్ రాజకీయాల్లో చురుకుగా ఉన్న దానం నాగేందర్ భవిష్యత్‌పై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఉప ఎన్నికలో కాంగ్రెస్ మళ్లీ ఆయనకే అవకాశం ఇస్తుందా? లేక ఎమ్మెల్సీ, మంత్రి పదవి వంటి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపుతుందా? అన్న చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు దానం ఖైరతాబాద్ వినాయకుడి వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లినట్లు సమాచారం. తదుపరి రాజకీయ కార్యాచరణపై ఇరువురి మధ్య చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయాలు సాధించిన కాంగ్రెస్ ఖైరతాబాద్‌ను కూడా దక్కించుకోవాలని భావిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని తిరిగి సాధించడం ద్వారా గ్రేటర్ హైదరాబాద్‌లో తన బలాన్ని చాటుకోవాలని బీఆర్ఎస్ చూస్తోంది. గతంలో ఖైరతాబాద్‌లో ప్రాతినిధ్యం వహించిన బీజేపీ కూడా మరోసారి తన పట్టు నిరూపించుకోవాలని భావిస్తోంది.

### కాంగ్రెస్‌లో టికెట్ కోసం పోటీ

దానం నాగేందర్ 1989లో ఆసిఫ్‌నగర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 1994, 1999 ఎన్నికల్లో విజయం సాధించారు. 2004లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలిచిన ఆయన అనంతరం కాంగ్రెస్‌లో చేరేందుకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆ ఉప ఎన్నికలో

(మిగతా 2వ పేజీలో)



# 22ఏ లో ఉన్నా రిజిస్ట్రేషన్‌కు ఓకే

- నిషేధిత జాబితాలోని సుమారు 300 కాలనీలకు ఊరట
- 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్లకు మార్గం
- స్థానిక సంస్థల అనుమతులున్న ఆస్తులకే వర్తింపు
- ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ ఉంటే రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి కమిటీ
- కోర్టు పరిధిలోని అంశాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయి
- తక్షణమే రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు: మంత్రి పొంగులేటి

ఈనాడు, హైదరాబాద్: దశాబ్దాలుగా ఇళ్ల యజమానులు, ప్లాట్ల కొనుగోలుదారులను ఇబ్బంది పెడుతున్న 22ఏ జాబితా సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం కీలక పరిష్కారం చూపింది. నిషేధిత జాబితాలో కొనసాగుతున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఆస్తులకు ఈ వెసులుబాటు వర్తించనుంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 కాలనీల్లోని 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లకు ఊరట లభించనుంది. ఈ నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్ తదితరులు సమావేశమై 22ఏ సమస్యపై చర్చించారు. అనంతరం రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, దాని పరిసర జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 22ఏ జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు

(మిగతా 2వ పేజీలో)



## తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్

- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్
- బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు
- ఏపీ, తెలంగాణ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్ నియామకం
- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శుల నియామకం

## చర్లపల్లి జైలులో ప్రణయ్ కేసు దోషికి గుండెపోటు.. గాంధీ ఆస్పత్రిలో కన్నుమూత



- ప్రణయ్ పరువు హత్య కేసులో దోషి అబ్దుల్ బారి మృతి
- ఈ కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న బారి
- ప్రధాన నిందితుడు మారుతీరావు గతంలోనే ఆత్మహత్య
- అమృతను కులాంతర వివాహం చేసుకున్నందుకు ప్రణయ్ హత్య



## రాహుల్, రేవంత్‌లకు ఇది చెంపపెట్టు": కేటీఆర్

- ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ
- రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు
- పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని రాహుల్‌కు సవాల్

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి,

(మిగతా 2వ పేజీలో)



### హైదరాబాదులో ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం

## హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

- షర్మిల ఇంట మొదలైన పెళ్లిసందడి
- హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడలో నేడు నిశ్చితార్థం
- సతీసమేతంగా హాజరైన రేవంత్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆమె కుమార్తె అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మిగతా 2వ పేజీలో)

## విశాఖ సదస్సుతో ఏపీకి కొత్త పెట్టుబడులు తీసుకురావాలి: చంద్రబాబు



- నవంబర్ 12, 13న విశాఖలో భాగస్వామ్య సదస్సు
- ఐదు ప్రాంతాల్లో ముందస్తు సదస్సులు నిర్వహించాలి
- 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన
- పాత ఎంవోయూలను కార్యరూపంలోకి తీసుకురావాలి
- దేశ, విదేశాల్లో విస్తృతంగా రోడ్‌షోలు నిర్వహించాలి
- స్టార్టప్‌లకు పెట్టుబడుల కోసం ప్రత్యేక వేదికలు..
- ఏపీ బ్రాండ్‌ను ప్రపంచానికి చాటిచెప్పాలి

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను పెద్దఎత్తున తీసుకు రావడమే లక్ష్యంగా విశాఖపట్నంలో నిర్వహించే 'సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి. ఈ సదస్సు కేవలం ఎంవోయూలు చేసుకునే కార్యక్రమంగా కాకుండా.. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలవాలి. పారిశ్రామికవేత్తల్లో నూతనోత్సాహం నింపేలా ఏర్పాట్లు చేయాలి. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నాం. దీనికి ముందు రాష్ట్రంలోని ఐదు కీలక ప్రాంతాల్లో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలి. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేకతలు, వనరులకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలి. ప్రాంతీయ సదస్సుల్లోనే వీలైనన్ని ఎంవోయూలను పూర్తి చేసి.. ప్రధాన సదస్సులో కీలక ప్రాజెక్టులు, ఉన్నతస్థాయి చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఈసారి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. సదస్సుకు ముందే 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు

(మిగతా 2వ పేజీలో)

# ఖైరతాబాద్‌లో ఇక ఉప ఎన్నికే!

ఓడిపోయారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. 2014లో బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి పాలై బీఆర్ఎస్‌లో చేరారు. 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా వరుసగా రెండుసార్లు గెలిచారు. ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్‌లో దానంతో పాటు పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. 2023లో దానంపై పోటీ చేసి 42 వేలకు పైగా ఓట్లు సాధించిన పి.విజయారెడ్డి మరోసారి టికెట్ కోసం ప్రయత్నించే అవకాశం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా చెప్పబడుతున్న డాక్టర్ రోహిన్‌రెడ్డి, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా ఆశావహులుగా ఉన్నట్లు సమాచారం. అభ్యర్థి ఎంపికలో పార్టీ అంతర్గత సమీకరణాలు కీలకంగా మారనున్నాయి.

### సిట్టింగ్ స్థానంపై బీఆర్ఎస్ గురి

ఖైరతాబాద్‌లో వరుసగా రెండుసార్లు గెలిచిన బీఆర్ఎస్ ఈ స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని కసరత్తు చేస్తోంది. గతంలో పార్టీ తరఫున పనిచేసిన విజయారెడ్డి, గద్వాల విజయలక్ష్మి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉండటంతో కొత్త అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టింది. ఉద్యమ కాలం నుంచే బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఆయన భార్య మన్నె కవితారెడ్డి రెండుసార్లు జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2018లో ఖైరతాబాద్ టికెట్ ఆశించిన గోవర్ధన్‌రెడ్డి బీఎస్పీ నుంచి పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. అనంతరం తిరిగి బీఆర్ఎస్‌లో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు తలసాని సాయికిరణ్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. బీసీ, యాదవ సామాజికవర్గాల సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించే అవకాశం ఉంది. 2019లో సికింద్రాబాద్ లోక్‌సభకు బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన సాయికిరణ్ ఓటమి పాలయ్యారు. 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో గణనీయమైన ఫలితాలు సాధించిన బీజేపీ.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ స్థానానికే పరిమితమైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి గెలుపొందారు. ఖైరతాబాద్ కూడా అదే లోక్‌సభ పరిధిలో ఉండటంతో ఉప ఎన్నికను పార్టీ కీలకంగా చూస్తోంది. 2014లో టీడీపీ పొత్తుతో బీజేపీ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన చింతల రామచంద్రారెడ్డి 2018, 2023 ఎన్నికల్లోనూ పోటీ చేశారు. మరోసారి టికెట్ కోసం ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్‌వీ సుభాష్, బి.ఇంద్రసేన్‌రెడ్డి, జూటూరి కీర్తిరెడ్డి పేర్లు కూడా బీజేపీ ఆశావహుల్లో వినిపిస్తున్నాయి.

### మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలకు పదును పెట్టనున్నాయి. దానం నాగేందర్ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయారెడ్డి సాధించిన ఓట్లు అధికార పార్టీకి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలుగా మారాయి. మరోవైపు ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. బీజేపీ మాత్రం రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా తన బలాన్ని చాటేందుకు ప్రయత్నించనుంది. అభ్యర్థుల ఎంపికతో పాటు స్థానిక సమీకరణాలు, ప్రచార వ్యూహాలు, పార్టీ యంత్రాంగం పనితీరు కీలకం కానున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలోని మైనారిటీలు, బస్తీ ఓటర్లు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, స్థానిక నెట్‌వర్క్, పార్టీల సంప్రదాయ ఓటు బ్యాంకులు ఫలితాన్ని ప్రభావితం చేసే అంశాలుగా నిలవనున్నాయి. ఖైరతాబాద్ ఉప ఎన్నిక కేవలం ఒక అసెంబ్లీ స్థానానికే పరిమితం కాకుండా హైదరాబాద్ రాజకీయ సమీకరణాలకు ప్రాధాన్యంగా మారింది. రానున్న గ్రేటర్ పరిధిలోని మున్సిపల్ ఎన్నికలకు ముందు జరిగే ఈ పోరు.. మూడు ప్రధాన పార్టీల బలాబలాలకు మరో పరీక్షగా నిలవనుంది.

# 22ఏలో ఉన్నా రిజిస్ట్రేషన్‌కు ఓకే

నిలిచిపోయాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో 44, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 65 కాలనీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోర్టు తీర్పులు, భూముల వేలం, క్రమబద్ధీకరణల తర్వాత ఏర్పడిన కాలనీల్లోని ఆస్తులకు సంబంధించిన వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదు కాకపోవడంతో అవి ప్రభుత్వ భూముల జాబితాలో కొనసాగాయి. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గత ఏడాది 22ఏ జాబితాను సవరించి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొన్ని నివాస ప్రాంతాలు, లేఅవుట్లు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం ఏర్పడింది. దీనిపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సమస్యను ప్రత్యేకంగా పరిగణించిన ప్రభుత్వం వివిధ రకాలుగా ఉన్న 12 సమస్యలను గుర్తించి పరిష్కార ప్రక్రియను ప్రారంభించింది.

### అనుమతులుంటే రిజిస్ట్రేషన్

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీతో పాటు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఖాళీ స్థలాలు, ఇళ్లు, ఫ్లాట్లకు నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. అయితే సంబంధిత సంస్థలు జారీ చేసిన చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతుల పత్రాలు ఉండాలి. అదేవిధంగా గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న రికార్డులు, భూమి స్వభావం, చట్టబద్ధమైన అనుమతులను పరిశీలించిన తర్వాత అర్హత ఉన్న ఆస్తులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది.22ఏ జాబితాకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఈ కమిటీలు పనిచేస్తాయి. ఆస్తికి సంబంధించిన రికార్డులు, అనుమతులు, భూమి స్వభావం తదితర అంశాలను పరిశీలించి అర్హతను నిర్ణయించనున్నాయి. అయితే ఇప్పటికే న్యాయస్థానాల్లో ఉన్న వివాదాలకు ఈ ఉత్తర్వులు నేరుగా వర్తించవు. కోర్టు పరిధిలోని అంశాలు ఆయా కేసుల్లో వెలువడే తుది తీర్పులకు లోబడి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న 22ఏ సమస్యకు ప్రభుత్వం వేగంగా పరిష్కారం చూపిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనుమతులు పొందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఇక ఆటంకం ఉండదని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ చూపాల్సి ఉంటుందని వివరించారు.రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 64 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణకు జీవో 118, సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణకు జీవో 76 ఇప్పటికే జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. 22ఏ జాబితాలో ఉన్న భూములన్నింటినీ ఒకే విధంగా పరిగణించకుండా.. భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హత ఉన్న వాటికి సత్వర పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.

# విశాఖ సదస్సుతో ఏపీకి కొత్త పెట్టుబడులు తీసుకురావాలి: చంద్రబాబు

శంకుస్థాపనలు పూర్తి చేయాలి. ప్రతి రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఎంఎస్ఎంఈ షోకేస్ ఏర్పాటు చేసి స్థానిక పరిశ్రమల ఉత్పత్తులను ప్రదర్శించాలి. స్టార్టప్‌లకు పెట్టుబడులు అందేలా 'షార్క్ ట్యాంక్' తరహా కార్యక్రమాన్ని నిర్వహించాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ప్రాంతీయ సదస్సులతో అనుసంధానం చేయాలి. రాష్ట్రంలో యువతలో పారిశ్రామిక ఆలోచనా విధానాన్ని పెంచేందుకు 7వ తరగతి నుంచే ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను పాఠ్యాంశాల్లో చేర్చాలి. 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లో నిర్వహించాలి. ఇప్పటికే కుదిరిన ఎంవోయూలను కాగితాలకే పరిమితం చేయకుండా వేగంగా కార్యరూపంలోకి తీసుకురావాలి. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ.22.57 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయి. ఇందులో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయి. 247 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ చివరి నాటికి పెండింగ్ ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలి. కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో 75 శాతం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఇతర సదుపాయాల విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. అక్టోబర్ 7న విశాఖలో ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ, ఫార్మా, మెడ్‌టెక్ రంగాలపై దృష్టి పెట్టాలి. అక్టోబర్ 12న కాకినాడలో మారిటైమ్, షిప్ బిల్డింగ్, గ్రీన్ హైడ్రోజన్, ఆక్వా ఎగుమతులపై చర్చలు జరగాలి. అక్టోబర్ 16న గుంటూరులో గవర్నెన్స్, రాజధాని నిర్మాణం, క్వాంటం వ్యాలీ, పట్టణ మౌలిక వసతులపై దృష్టి పెట్టాలి. అక్టోబర్ 23న అనంతపురంలో ఏరోస్పేస్, రక్షణ, ఆటోమోటివ్, పునరుత్పాదక ఇంధన రంగాలను ప్రోత్సహించాలి.

అక్టోబర్ 26న తిరుపతిలో పర్యాటకం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, అంతరిక్ష సాంకేతిక రంగాలపై పెట్టుబడులను ఆకర్షించాలి. 'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్' అనే ఇతివృత్తంతో సదస్సును నిర్వహించాలి. దేశీయంగా చెన్నై, బెంగళూరులో రోడ్‌షోలు పూర్తయ్యాయి. అహ్మదాబాద్, హైదరాబాద్, ముంబయిలోనూ రోడ్‌షోలు నిర్వహించాలి. సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్‌లో అంతర్జాతీయ రోడ్‌షోలు పూర్తయ్యాయి. స్వీడన్, జపాన్, చైనాల్లోనూ రోడ్‌షోలు నిర్వహించాలి. అంతర్జాతీయ మంత్రులు, వివిధ దేశాల ప్రతినిధులు సదస్సుకు వచ్చేలా సమన్వయం చేయాలి. అక్టోబర్ 8న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. కాపులుప్పాడలో నిర్మించే కన్వెన్షన్ సెంటర్‌ను బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడేలా రూపొందించాలి. రాజమహేంద్రవరంలోని సెంటర్ నిర్మాణాన్ని గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలి. విశాఖ సదస్సు ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు.. ఇప్పటికే వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావాలి.




### మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌లపై

## పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

### ::: బీఆర్ఎస్ నేత హరీశ్

తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## చర్లపల్లి జైలులో ప్రణయ్ కేసు దోషికి గుండెపోటు.. గాంధీ ఆస్పత్రిలో కన్నుమూత

తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ప్రణయ్ పరువు హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న దోషి అబ్దుల్ బారి (50) గురువారం మృతి చెందాడు. హైదరాబాద్‌లోని చర్లపల్లి కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న అతడికి మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బారి మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ కుమార్‌ని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. తన కుమార్తె అమృతను కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో ఆమె తండ్రి, వ్యాపారవేత్త మారుతీరావు సుమారు రూ. కోటి సుపారీ ఇచ్చి ఈ హత్య చేయించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. గర్భిణిగా ఉన్న భార్య అమృత కళ్లెదుటే జరిగిన ఈ దారుణ దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మారుతీరావు 2020 మార్చిలో బెయిల్‌పై ఉన్న సమయంలో ఆత్మహత్య చేసుకున్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం నల్గొండ ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు.. హత్యకు పాల్పడిన సుభాష్ కుమార్ శర్మకు మరణశిక్ష విధించగా, కుట్రలో భాగస్వాములైన అస్గర్ అలీ, అబ్దుల్ బారి, మారుతీరావు సోదరుడు శ్రవణ్ కుమార్ సహా పలువురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ కేసులో నాలుగో నిందితుడైన బారి పేరు గతంలో గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్య హత్య కేసులోనూ వినిపించడం గమనార్హం.

## తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్

బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

## హైదరాబాదులో ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు. నూతన జంటకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యుల మధ్య ఈ వేడుక వైభవంగా జరిగింది. కాగా, తన కుమార్తె వివాహానికి సంబంధించిన కీలక తేదీలను షర్మిల కొద్ది రోజుల క్రితమే స్వయంగా ప్రకటించారు. సెప్టెంబర్ 24న నిశ్చితార్థం, నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ ఉంటుందని ఆమె ఎక్స్ వేదికగా వెల్లడించారు. వివాహ వేడుకకు సంబంధించిన మొదటి ఆహ్వాన పత్రికను ఇడుపులపాయలోని తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ క్రమంలో, వివాహ ఆహ్వానం కోసం తన సోదరుడు వైఎస్ జగన్‌ను కలవడంపై వస్తున్న రాజకీయ ఊహాగానాలను షర్మిల ఖండించారు. తన కుమార్తె వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణాలు చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

## రాహుల్, రేవంత్‌లకు ఇది చెంపపెట్టు": కేటీఆర్

స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ ఏరాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.

## జాతీయ అందాల పోటీల్లో మెరిసిన ఆదిలాబాద్ యువతి

### జైపూర్‌లో జరిగిన మిస్ ఎర్త్ ఇండియా పోటీల్లో విజయం
### మిస్ ఇండియా ఎర్త్ వాటర్ 2026 కిరీటం కైవసం
### ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ప్రీతి ముండే
### మిస్ కంజీనియాలిటీ ప్రత్యేక పురస్కారం కూడా సొంతం
### పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించిన ప్రీతి



ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన యువతి ప్రీతి ముండే జాతీయ స్థాయి అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 19న జరిగిన 'మిస్ డివైన్ బ్యూటీ 2026' గ్రాండ్ ఫినాలేలో ఆమె 'మిస్ ఇండియా ఎర్త్ వాటర్ 2026' కిరీటాన్ని కైవసం చేసుకుంది. దీంతో పాటు 'మిస్ కంజీనియాలిటీ' ప్రత్యేక పురస్కారాన్ని కూడా గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. డివైన్ బ్యూటీ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో ప్రీతి ముండే తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. మహారాష్ట్రకు చెందిన ఆర్య అవధూత్ ప్రధాన టైటిల్ అయిన 'డివైన్ మిస్ ఎర్త్ ఇండియా 2026'ను గెలుచుకోగా, ముఖ్యమైన ఎలిమెంటల్ టైటిల్స్‌లో ఒకటైన 'వాటర్' కిరీటాన్ని ప్రీతి దక్కించుకుంది. ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ అనే చిన్న గిరిజన గ్రామానికి చెందిన ప్రీతి పట్టుదలతో తన కలను సాకారం చేసుకుంది. తల్లిదండ్రులు ముండే ప్రహ్లాద్, ఉమా. గ్రామీణ నేపథ్యం నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రీతి మోడలింగ్ రంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. గతంలో 'మిస్ హైదరాబాద్ రన్నరప్', 'మిస్ మహారాష్ట్ర (బ్రెయిన్ విత్ బ్యూటీ)' వంటి టైటిల్స్‌ను కూడా గెలుచుకుంది. మోడలింగ్‌తో పాటు జ్యోతిష్యం, టారోట్ రీడింగ్ వంటి అంశాలపై కూడా ఆమెకు ఆసక్తి ఉంది. ఒక మారుమూల ఏజెన్సీ గ్రామం నుంచి వచ్చిన యువతి జాతీయ వేదికపై విజయం సాధించడంపై ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ప్రీతి నిరూపించిందని అభినందిస్తున్నారు.

# సమానత్వం మన జన్మహక్కు అని నినదించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ

## (25 సెప్టెంబర్ "అంత్యోదయ దినోత్సవం" సందర్భంగా)



2014 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా ప్రతి ఏట 25 సెప్టెంబర్ రోజును "అంత్యోదయ దినోత్సవం (అంత్యోదయ దివస్)" పాటించడం కొనసాగుతున్నది. అట్టడుగు వర్గాల ఉన్నతికి దీన్‌దయాల్ ఉపాధ్యాయ చేసిన అవిశ్రాంత సేవలను గుర్తు చేసుకోవడానికి, వీరి జీవితం నుంచి ప్రేరణ పొందడానికి ఈ ఎ ే ది క న ం వినియోగించుకుంటున్నాం. 1965లో పండిట్ దీన్‌దయాల్ ప్రతిపాదించిన "సమగ్ర మానవతావాదం (ఇంటెగ్రల్ హ్యూమనిజమ్)" ఆలోచనల ద్వారా సామాజిక బాధ్యత, అభివృద్ధిల మధ్య సమతుల్యత సాధించాలని ప్రచారం చేశారు. అభివృద్ధి వరుసలో చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందితేనే అసలైన సమగ్రాభివృద్ధి, శ్రేయస్సు అవుతుందని వివరించారు.

**అభివృద్ధికి దూరంగా ఉన్న చివరి వ్యక్తి ఎదుగుదల**

అంత్యోదయ అనే పదంలో అంత్య (చివరి), ఉదయ్(ఎదుగుదల) అనే 'చివరి వ్యక్తి ఎదుగుదల లేదా అత్యంత పేద వ్యక్తి అభ్యున్నతి' అనబడే అర్థం దాగి ఉన్నది. ఉపాధ్యాయ ఆలోచనలు, లక్ష్యాల ప్రకారం అభివృద్ధికి దూరంగా ఉన్న అభాగ్య అట్టడుగు వర్గాలకు కూడా అభివృద్ధి ఫలితాలు అందిన నాడే అసలైన సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుందని స్పష్టం చేశారు. అంత్యోదయ దినం వేదికగా నిరు పేదలకు సంక్షేమ పథకాల అమలు, సమ్మిళిత అభివృద్ధి, సామాజిన న్యాయ కల్పన, పాలసీల విశ్లేషణలు, ప్రజల్లో అవగాహన, పేదరికం నిర్మూలన, సామాజిక అభివృద్ధి, చైతన్యం లాంటి లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. 25 సెప్టెంబర్ 2016 రోజున కేంద్ర ప్రభుత్వం "దీన్‌దయాల్ అంత్యోదయ యోజన" అనే పథకాన్ని ప్రవేశపెట్టి పేదరిక నిర్మూలనకు నడుం బిగించడం జరిగింది. ఈ పథకంలో భాగంగా నైపుణ్య శిక్షణ,ఉద్యోగ ఉపాధుల కల్పన, గృహ నిర్మాణాలు, వీధి వ్యాపారుల ఉన్నతి, మహిళా స్వయం సహాయక బృందాల ఏర్పాటు, సుస్థిర గ్రామీణ అభివృద్ధి, స్వల్ప కాలిక రుణాల వెసులుబాటు లాంటి అంశాలను అమలు చేయడం జరుగుతోంది.

**బహుముఖ ప్రజ్ఞాశాలి పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ:**

భారతీయ ప్రముఖ నాయకులు, భారతీయ జనసంఘ్ సహ-వ్యవస్థాపకులు, ఆర్‌ఎస్‌ఎస్ విధాన ఆలోచనాపరుడు అయిన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ మన దేశ రాజకీయ యవనికపై చెరగని ముద్రను వేశారు. యూపీ, మధుర జిల్లా నాగ్రా చంద్రబన్ గ్రామంలో 25 సెప్టెంబర్ 1916న జన్మించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిరుప్రాయంలోనే తల్లితండ్రులను కోల్పోయారు. తన సమీప బంధువు చొరవతో కాన్పూర్‌లో బి. ఏ. డిగ్రీని అత్యున్నత మార్కులతో పొందారు. 1937లో ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి దేశభక్తిని నరనరాల్లోకి ఎక్కించుకున్నారు. 1951లో భారతీయ జన సంఘ్ స్థాపనలో ప్రధాన పాత్రను పోషించి ఆ పార్టీకి జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. 11 ఫిబ్రవరి 1968 రోజున తన 51వ ఏట దురదృష్టకరంగా హత్య చేయబడ్డారు. 1953 నుంచి 1968 వరకు భారతీయ జనసంఘ్‌కు సేవలు అందించి, బిజేపీకి సైద్ధాంతిక కర్తగా మర్గనిర్దేశనం, నైతిక ప్రేరణకు మూలంగా నిలిచారు. దీనుల పాలిటి దయామయుడు ఉపాధ్యాయ జీవితం కడు పేదల అభ్యున్నతికే అంకితం అయ్యింది.

ప్రముఖ రచయిత, థింకర్, అట్టడుగు వర్గాల పక్షపాతి, అహింసాయుత ఆలోచనలు, కులమతవర్ణవర్గ విభేదాలు మరిచి సమానత్వ సాధన, సామాజిక న్యాయం, మానవీయ సంపద, సత్య ధర్మాలను పాటించడం, స్వదేశీ వస్తు ప్రచారకులు లాంటి అనేక విలక్షణతలు పరిచయం చేసిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవితం మనందరికీ దారి దీపం కావాలి. వారి బోధనలు మనకు నిత్య మంత్రాలుగా జపించబడాలి.



**- బి.ఎం.ఎస్. రెడ్డి , 9949700037**

# సిటిజన్ కాలనీలో ఘనంగా వినాయక చవితి కథ వృత్తం ప్రదర్శన



అల్వాల్: సిటిజన్ కాలనీ రోడ్ నంబర్లు 9, 10లో యజ్ఞ గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా చిన్నారులతో వినాయక చవితి కథ వృత్తం నాటకాన్ని ప్రదర్శించారు. చిన్నారులు ఉత్సాహంగా నాటకంలో పాల్గొని వినాయక చవితి విశిష్టతను, పండుగకు సంబంధించిన ఆధ్యాత్మిక సందేశాన్ని చక్కగా ప్రదర్శించారు. చిన్నారుల నటనను చూసిన భక్తులు, కాలనీ వాసులు అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చిన్నారుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# దివంగత ఎం.ఆర్. కృష్ణ 102వ జయంతి వేడుకలు



## నిరుపేదలకు బియ్యం పంపిణీ.. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

యాప్రాల్: భీమ్‌రావు అంబేద్కర్ వి.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత శ్రీ ఎం.ఆర్. కృష్ణ 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాప్రాల్ జై జై నగర్‌లో ఉన్న ఎం.ఆర్. కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎం.ఆర్. కృష్ణ డిఫెన్స్, ఇండస్ట్రీస్ యూనియన్ మినిస్టర్‌గా సేవలందించారని, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అండగా నిలిచి సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయంతి సందర్భంగా నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్. గిల్, ఎఫ్. వరలక్ష్మి, వి. జీవకన్, దినకర్, వేణుగోపాల్, బబ్లు, కృష్ణ, వాణి, రేఖ, సంపత్, పూజారి తదితరులు పాల్గొన్నారు.

# ఎంహెచ్ కాలనీలో వినాయక మండపం, కమ్యూనిటీ హాల్ ప్రారంభం

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

అల్వాల్: ఎంహెచ్ కాలనీ వాసుల ఆహ్వానం మేరకు మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాలనీలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని హనుమంతరావు పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించేలా జోనల్ కమిషనర్‌తో మాట్లాడి, కాలనీవాసుల పరిస్థితులను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీకాంతరెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ సంతోష్ రెడ్డి, బుచ్చిరెడ్డి సుధీర్ రెడ్డి, జీవన్, రామకృష్ణ,



మోహన్ రావు, గోపాల్ జి, సంతోష్ కుమార్, శంకర్, నరసింహారెడ్డి, నవీన్, రావు, ఖలీల్, సుధారాణి, వరలక్ష్మి, స్థానిక నాయకులు లడ్డు రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.




# హామీల అమలే లక్ష్యం.. పోరాటమే మార్గం

## అల్వాల్‌లో 8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ముత్యాలు, అనిల్ రాజ్, పి. రాజు, సత్తయ్యలు దీక్షలో కూర్చున్నారు. ఈరోజు దీక్షా కార్యక్రమానికి మాజీ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, హైదరాబాద్ జేఏసీ చైర్మన్ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై దీక్షను ప్రారంభించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, ఏ.డి. దయాకర్, డోలి సుధీర్, శేరుపల్లి మల్లేష్, జానకి రెడ్డి, సతీష్, నగేష్ తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

# సంపాదకీయం

## ఖైరతాబాద్ ఉపఎన్నిక.. ఓటరు తీర్పు చెప్పాల్సిన వేళ

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. 2023లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడంతో ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్ల వ్యవహారం న్యాయస్థానాల వరకు వెళ్లింది. తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. అనంతరం సుప్రీంకోర్టులోనూ ఆయనకు ఊరట లభించకపోవడంతో ఉపఎన్నికకు మార్గం సుగమమైంది. ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నికను కేవలం ఒక శాసనసభ స్థానానికి జరిగే ఎన్నికగా చూడటం సరిపోదు. హైదరాబాద్ నగర రాజకీయాల్లో ఈ నియోజకవర్గానికి ఉన్న ప్రత్యేకత, మారుతున్న రాజకీయ సమీకరణాలు, మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ఉపఎన్నికకు ప్రాధాన్యం పెరిగింది. అయితే ఈ పోటీకి అసలు అర్థం ఇచ్చేది పార్టీల ప్రచార హోరు కాదు. స్థానిక ప్రజల సమస్యలపై అభ్యర్థులు ఏమి చెబుతున్నారు, వాటిని పరిష్కరించేందుకు ఏం చేయబోతున్నారు అన్నదే ప్రధానంగా ఉండాలి. ఖైరతాబాద్ రాజకీయ చరిత్రలో మార్పులు కొత్తవి కావు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ నియోజకవర్గం ఒకే పార్టీకి శాశ్వత కంచుకోటగా మిగలలేదు. 2014లో బీజేపీకి చెందిన చింతల రామచంద్రారెడ్డి ఇక్కడ విజయం సాధించారు. 2018లో దానం నాగేందర్ అప్పటి టీఆర్ఎస్ తరఫున గెలిచారు. 2023లోనూ బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో ఆయనకు 67,368 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డికి 45,358, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. ఈ గణాంకాలు నియోజకవర్గంలో మూడు పార్టీలకూ పోటీ సామర్థ్యం ఉన్నట్టు మాత్రమే చూపిస్తున్నాయి. ఉపఎన్నికలో ఇదే ఓటింగ్ ధోరణి పునరావృతమవుతుందని మాత్రం చెప్పలేం.

ఖైరతాబాద్ రాజకీయాన్ని అర్థం చేసుకోవాలంటే నియోజకవర్గ సామాజిక, భౌగోళిక స్వరూపాన్ని కూడా గమనించాలి. జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాలతో పాటు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు నివసించే అనేక కాలనీలు ఇందులో ఉన్నాయి. వేర్వేరు ఆదాయ వర్గాలు, వృత్తులు, సామాజిక నేపథ్యాలున్న ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. అందువల్ల ఒకే అంశం మొత్తం నియోజకవర్గాన్ని ప్రభావితం చేస్తుందని భావించడం రాజకీయ పార్టీలకు సరైన వ్యూహం కాకపోవచ్చు. ఈ ఎన్నికలో మొదట చర్చకు రావాల్సిన అంశం అభివృద్ధి. హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న కొద్దీ ఖైరతాబాద్ వంటి పాత నగర ప్రాంతాల్లో మౌలిక వసతుల సమస్యలు కొత్త రూపాల్లో ముందుకొస్తున్నాయి. రహదారుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వర్షపు నీటి పారుదల, తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, చెత్త నిర్వహణ, పాదచారుల భద్రత వంటి సమస్యలు ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో పెద్ద పెద్ద హామీల కంటే ఈ సమస్యలకు స్పష్టమైన పరిష్కార మార్గాన్ని చెప్పే అభ్యర్థుల మాటకు విలువ ఉండాలి.

హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడం కొత్త విషయం కాదు. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోనూ రాకపోకలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం కావాలంటే నియోజకవర్గ స్థాయిలో వరదనీటి ప్రవాహ మార్గాల పరిశీలన, నాలాల సామర్థ్యాన్ని పెంచడం, ఆక్రమణలను తొలగించడం, నిర్వహణ వ్యవస్థలో బాధ్యతను నిర్ధారించడం వంటి అంశాలపై చర్చ జరగాలి. వర్షం వచ్చినప్పుడు యంత్రాలను రంగంలోకి దించడం మాత్రమే పరిష్కారం కాదు. నగర ప్రణాళికలోనే వరద నియంత్రణకు స్థానం కల్పించాలి.

ఖైరతాబాద్ వంటి అత్యంత అభివృద్ధి చెందిన నగర నియోజకవర్గంలో ప్రజా రవాణా కూడా కీలక అంశమే. మెట్రో, బస్సులు, ప్రధాన రహదారులు అందుబాటులో ఉన్నప్పటికీ చివరి మైలు రవాణా, పార్కింగ్, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. కార్యాలయాలకు, విద్యాసంస్థలకు, వాణిజ్య ప్రాంతాలకు ప్రతిరోజూ వెళ్లే ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడం కూడా ప్రజాప్రతినిధి పనితీరులో ఒక ప్రమాణంగా ఉండాలి. నగర అభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు కాదు.. ప్రజలు సౌకర్యంగా, సురక్షితంగా ప్రయాణించగలగడం కూడా. మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వ సేవల అందుబాటు. నగర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య సేవలు, ప్రజా సదుపాయాల నాణ్యతపై ప్రజలు ప్రశ్నలు వేస్తున్నారు. ప్రైవేటు సేవలు అందుబాటులో ఉన్నాయనే కారణంతో ప్రభుత్వ వ్యవస్థలపై నిర్లక్ష్యం ఉండకూడదు. ఖైరతాబాద్ ఉపఎన్నికలో విద్య, ఆరోగ్యం, ప్రజా సేవల నాణ్యతపై పార్టీల నుంచి స్పష్టమైన విధాన చర్చ జరగాలి.

ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లో భూమి, ఆస్తులు, నిర్మాణ అనుమతులు, వారసత్వ భవనాలు, పట్టణ ప్రణాళిక వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. నగర విస్తరణలో అభివృద్ధి అవసరమే. అయితే అభివృద్ధి పేరుతో పౌరుల హక్కులు దెబ్బతినకూడదు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు స్పష్టమైన నిబంధనలు, ముందస్తు సమాచారం, అప్పీల్ అవకాశం, పారదర్శకత ఉండాలి. పౌరుల ఆస్తి భద్రత, నగర ప్రణాళిక రెండూ పరస్పర విరుద్ధమైన అంశాలుగా చూడకూడదు.

ఈ ఉపఎన్నికకు మరో ప్రత్యేక నేపథ్యం దళబదలింపుల అంశం. ఒక పార్టీ గుర్తుపై ఎన్నికైన ప్రజాప్రతినిధి తర్వాత మరో పార్టీలో చేరితే ఓటరు ఇచ్చిన తీర్పు స్థానం ఏమిటన్న ప్రశ్న తరచూ ఎదురవుతోంది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ దళబదలింపులపై నిబంధనలు కల్పించినప్పటికీ, వాటి అమలుపై రాజకీయ, న్యాయపరమైన చర్చ కొనసాగుతూనే ఉంది. దానం నాగేందర్ వ్యవహారంలో న్యాయస్థానాల తీర్పులతో ఒక నిర్దిష్ట న్యాయ ప్రక్రియ ముగిసినప్పటికీ, పార్టీ మార్పులపై విస్తృతమైన చర్చ మాత్రం కొనసాగుతుంది.

ఈ పరిణామం ఒక విస్తృతమైన ప్రజాస్వామ్య ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఎన్నికల్లో ప్రజలు అభ్యర్థిని ఎన్నుకుంటారా? పార్టీని ఎన్నుకుంటారా? రెండింటి కలయికకే ఓటు వేస్తారా? భారత ఎన్నికల వ్యవస్థలో పార్టీ గుర్తు, అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం రెండూ కలిసి పనిచేస్తాయి. అందుకే ఒక పార్టీ తరఫున గెలిచిన తర్వాత మరో పార్టీలోకి వెళ్లే సందర్భంలో ఓటరు తీర్పు పట్ల బాధ్యత ఎలా ఉండాలన్న ప్రశ్నకు రాజకీయ వ్యవస్థ స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఖైరతాబాద్ పరిణామం ఈ చర్చకు మరో ఉదాహరణగా నిలిచింది. అయితే ఉపఎన్నికను కేవలం దళబదలింపు చుట్టూనే తిప్పడం కూడా సరైనది కాదు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రజల ముందుకు వచ్చే ప్రధాన అంశాలు స్థానిక సమస్యలే కావాలి. రాజకీయ పార్టీలు పరస్పర ఆరోపణలకు ఎంత సమయం కేటాయిస్తాయో, నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికకు అంతకంటే ఎక్కువ సమయం కేటాయించాలి. ఎవరు గతంలో ఏ పార్టీలో ఉన్నారు అన్నదానితో పాటు.. భవిష్యత్తులో ఏం చేయబోతున్నారు అన్నది కూడా ఓటరుకు తెలియాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మూడు పార్టీలూ ఖైరతాబాద్‌పై దృష్టి సారించే అవకాశం ఉంది. అభ్యర్థుల విషయంలో మాత్రం అధికారిక నిర్ణయాలు వెలువడే వరకు ప్రచారంలో ఉన్న పేర్లను తుది జాబితాగా చూడాల్సిన అవసరం లేదు. వివిధ పార్టీల్లో పలువురి పేర్లు చర్చలో ఉండవచ్చు. కానీ చివరకు అభ్యర్థి ఎంపికలో స్థానిక ప్రజలతో సంబంధం, ప్రజా సమస్యలపై అవగాహన, రాజకీయ అనుభవం, అందుబాటులో ఉండే స్వభావం వంటి అంశాలు చర్చకు రావడం సహజం.

అభ్యర్థి ఎంపికలోనూ పార్టీలకు ఒక పరీక్ష ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉండే నాయకుడా? పార్టీ కార్యకర్తలతో సంబంధం ఉన్న వ్యక్తినా? ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవాడా? గతంలో చేసిన పనిని ప్రజల ముందుంచగలడా? ఎన్నికల తర్వాత కూడా నియోజకవర్గంలో అందుబాటులో ఉంటాడా? వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కేవలం ఎన్నికల సమయంలో ప్రచారం చేసే అభ్యర్థి కన్నా ప్రజలతో నిరంతరం సంబంధం కొనసాగించే ప్రజాప్రతినిధి అవసరం ఉందన్న భావన ప్రజల్లో ఉంటుంది.



**-గుర్రం పాపిరెడ్డి**
**-ఎడిటర్**

# మాజీ ఎంపీటీసీ బొల్లి లింగం మృతికి నాయకుల నివాళి

### భౌతికకాయానికి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ మండల అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బొల్లి లింగం గుండెపోటుతో అకాల మరణం చెందడం బాధాకరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగం మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, ఎల్లారెడ్డిపేట మండల సర్పంచ్ ఎలగందుల నరసయ్య, అందె సుభాష్ తదితర నాయకులు హుటాహుటిన గొల్లపల్లికి చేరుకున్నారు. లింగం భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లింగం సామాజిక ఉద్యమాల్లో, గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను నాయకులు గుర్తుచేసుకున్నారు. లింగం మృతి పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు లింగం మృత దేహానికి నివాళులర్పించారు.



# ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం

### విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు జాతీయ సేవా పథకం ప్రాధాన్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, సహకార భావనను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజ సమస్యలను అర్థం చేసుకోవడంతో పాటు ఇతరులకు సేవ చేయాలనే దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరగడంతో పాటు భాషా నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా శక్తి, విషయ పరిజ్ఞానం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞాన, సాహిత్య, చరిత్ర, జనరల్ నాలెడ్జ్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కూడా చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయం విద్యార్థుల జ్ఞానాన్ని విస్తరించే వేదికగా నిలుస్తుందని, ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని అన్నారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అది దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ప్రిన్సిపాల్ సూచించారు. విద్యార్థి దశలోనే సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పరశురాములు, అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

### సిరిసిల్లకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు




ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లాకు విద్యారంగంలో కీలక ప్రాజెక్టు మంజూరైంది. సిరిసిల్ల నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వినతికి స్పందిస్తూ సిరిసిల్లకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో రూ.200 కోట్లతో ప్రతిష్టాత్మక పాఠశాల మంజూరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్ ల్యాబొరేటరీలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ సదుపాయాలు, క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. చదువుతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, క్రీడా ప్రతిభను పెంపొందించేలా సమగ్ర విద్యా వాతావరణాన్ని కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

#### గ్రామీణ, పట్టణ విద్యార్థులకు సమాన అవకాశాలు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమానమైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక విద్యా విధానంతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా పాఠశాలలను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల్లో మరమ్మతులు, అవసరమైన మౌలిక వసతుల కల్పన చేపట్టినట్లు పేర్కొన్నారు.

#### హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు

సిరిసిల్లకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు మరింత చేరువ కానున్నాయని వారు పేర్కొన్నారు.

# చెట్ల కింద మధ్యాహ్న భోజనం.. మౌలిక వసతులు ఎక్కడ?

### మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడమే కాదు..
### పాఠశాల అవసరాలపై దృష్టి పెట్టాలని గ్రామస్థుల సూచన
### తల్లిదండ్రులు సైతం భోజన నాణ్యత, రుచిని పరిశీలించాలి



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంట విధానం, విద్యార్థులకు వడ్డిస్తున్న తీరును పరిశీలించారు. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యురాలు పద్మారెడ్డి, పోచంపల్లి మంగ, భానురాజు, ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అయితే పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాల పరిస్థితిపై కూడా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మధ్యాహ్న భోజనం వంటకు సరైన వసతులు లేక చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఉంటే, కేవలం భోజనాన్ని పరిశీలించడం వల్ల ప్రయోజనం ఏమిటని కొందరు గ్రామస్థులు ప్రశ్నించారు.

#### చెట్ల కింద వంట.. విద్యార్థులకు వడ్డింపు

పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకు అవసరమైన సౌకర్యాలు, ప్రత్యేక వంటశాల, ఇతర మౌలిక వసతులు వంటి అంశాలను కూడా పరిశీలించాలని గ్రామస్థులు సూచిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం ఎంత ముఖ్యమో, ఆ భోజనం తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండటం కూడా అంతే ముఖ్యమని పేర్కొంటున్నారు. చెట్ల కింద వంట చేయడం, అక్కడే ఆహారాన్ని సిద్ధం చేసి విద్యార్థులకు వడ్డించే పరిస్థితులు ఉంటే వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులపై ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏమిటి? ఏయే సమస్యలు ఉన్నాయి? అనే విషయాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

#### తల్లిదండ్రులు కూడా పరిశీలించాలి

ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను ఉపాధ్యాయులపై నమ్మకంతో, గౌరవంతో పంపిస్తున్న తల్లిదండ్రులు కూడా పాఠశాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చూడాలని గ్రామస్థులు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను తల్లిదండ్రులు నెలకోసారి అయినా స్వయంగా పరిశీలించాలని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మాత్రమే కాకుండా పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, విద్యుత్, పారిశుధ్యం, వంటశాల, విద్యార్థులకు అవసరమైన ఇతర సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది కూడా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పరిశీలించాలని సూచించారు.

#### గ్రామసభలో పాఠశాల సమస్యలపై చర్చించాలి

పాఠశాలలో గుర్తించిన సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాఠశాలకు ఏ అవసరాలు ఉన్నాయో ముందుగా గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, విద్యార్థులు చదువుకునే పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత ఉంటే వాటిపై కూడా ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాఠశాల అభివృద్ధి విషయంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కలిసి పనిచేస్తే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చని పేర్కొన్నారు.



## రూ.45 వేలకు స్వామివారి కండువా

### హనుమాన్‌నగర్‌లో ఘనంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

హనుమాన్‌నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ సంఘం రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. గణనాథుడి లడ్డూ రూ.2,52,200 పలికింది. వనస్థలిపురానికి చెందిన అవిసా కన్స్ట్రక్షన్స్ అధినేత నెల్లికొండ సురేందర్‌రెడ్డి, ఉప్పల్‌కు చెందిన ఎంకేఎస్ లేడీస్ హాస్టల్ ప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో లడ్డూను దక్కించుకున్నారు. నవరాత్రుల్లో స్వామివారి మెడలో అలంకరించిన కండువాను కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ చెందిన యాదాటి నాగమోహన్ రూ.45 వేలకు వేలంలో యాగంటి మోహన్ దక్కించుకున్నారు. హనుమాన్‌నగర్‌లో గత 18 ఏళ్లుగా గణపతి మండపాన్ని ఏర్పాటు చేసి నిత్యం ప్రత్యేక పూజలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడిని భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు



## రాక్‌టౌన్‌లో ఘనంగా 24వ గణపతి నవరాత్రుల ఉత్సవాలు

రాక్ టౌన్ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న 24వ గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే ఈరోజు జరిగిన లడ్డూ ప్రసాదం వేలంలో రూ.3,05,000/-లకు శ్రీ ఇర్ల కోటి రెడ్డి శ్రీమతి ఇర్ల నిర్మల కుమార్తె ఇర్ల రుచిత కుమారుడు ఇర్ల మోహన్ కృష్ణ రెడ్డి దక్కించుకున్నారు. అలాగే గణపతి కలశాన్ని తుమ్మలపల్లి శ్రీకాంత్ రెడ్డి దంపతులు రూ.51,000/-లకు దక్కించుకున్నారు. వేలంలో పట్టు పంచలు, కొండువాలు, కరెన్సీ దండలు, రూ.10 నోట్ల దండలు, కాయిన్స్‌తో పాటు ఇతర వస్తువులను ఎర్ర లావణ్య మధుకర్, భీమ్ రెడ్డి, బొజ్జ వేణుగోపాల్ రెడ్డి, గోలి ఉమా సురేందర్ రెడ్డి, కడియాల పద్మా ఉమామహేశ్వర్ రెడ్డి, శిరీష-DKV శర్మ, కొంతం గోవర్ధన్ రెడ్డి, దండు శ్రీధర్, నాగిరెడ్డి నరేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మన్నే రవీందర్ రెడ్డి తదితరులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ కమిటీ సభ్యులు మణిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రాంచంద్రా రెడ్డి, నవీన్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంపత్ కుమార్, ప్రతాప్ రెడ్డి, లింగా రెడ్డి, రాంరెడ్డి, మాధవ రెడ్డి, సత్తి రెడ్డి, కొండల్ రెడ్డి, సీతారాం రెడ్డి, మహేష్ రెడ్డి, నరేష్, సుదర్శన్ చారి తదితరులతో పాటు మహిళలు, చిన్నారులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాక్ టౌన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ, భక్తుల సహకారంతో 24వ గణపతి నవరాత్రుల ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి గొల్లపల్లిలో విషాదం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24 : స్నానం చేస్తుండగా గుండెపోటు రావడంతో మాజీ ఎంపీటీసీ మృతి చెందిన విషాద ఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొల్లి లింగం (70) మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లి లింగం గురువారం ఉదయం 5 గంటల సమయంలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు.

#### గ్రామాభివృద్ధికి కృషి.

బొల్లి లింగం 2001లో ఎంపీటీసీగా విధులు నిర్వహించి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయనకు భార్య హనుమవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లింగం మృతి పట్ల రాచర్ల గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందె బాలయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## లింగం మృతికి కేటీఆర్ సంతాపం

### అంత్యక్రియల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బొల్లి లింగం మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లింగం మృతి విషయం తెలుసుకున్న కేటీఆర్ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌కు ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించాలని సూచించారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు కుటుంబానికి అండగా ఉండి అన్ని ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని కోరారు. అంత్యక్రియల నిమిత్తం కేటీఆర్ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని పంపించగా, ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం లింగం కుమార్తెలతో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్ వారికి మనోధైర్యం కల్పించి ఓదార్చారు.

#### లింగం మృతికి చీటీ లక్ష్మణరావు సంతాపం

బొల్లి లింగం మృతి పట్ల మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. లింగం భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆత్మరక్షణకు కరాటే ఎంతో ముఖ్యం: మల్లికార్జున్ గౌడ్

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : విక్టరీ షోటోకన్ కరాటే అసోసియేషన్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఐడియల్ గ్రామర్ స్కూల్ బొంగులూరు లో కరాటే కోచ్ యూ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐడియల్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి , నలంద గ్రామర్ స్కూల్ వెంకటేశం విచ్చేశారు ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో 80 మంది పై క్రీడాకారులు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లు మెరూన్ మరియు బ్రౌన్ బెల్ట్ విద్యార్థి విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. ఈ బెల్ట్ టెస్ట్ నిర్వహణ విక్టరీ షోటోకాన్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షులు కరాటే మల్లికార్జున్ గౌడ్ సమక్షంలో నిర్వహించారు వెంకటరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థిలకు క్రీడలు తప్పనిసరి అవసరమని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం ఉత్తేజపరస్తాయని తెలిపారు నలంద స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశం మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి పౌరులు అని విద్యార్థి విద్యార్థులకు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యం తో పాటు మహిళలకు ఆత్మరక్షణతో ధైర్యంగా ముందుకు వెళ్తారని ,ప్రతి విద్యార్థి విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి అవసరమని తెలిపారు. అసోసియేషన్ ఫౌండర్ కరాటే మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ నేటి సమాజంలో కరాటే క్రీడా తప్పనిసరి ప్రతి ఒక్కరికి అవసరమని కరాటే నేర్చుకోవడం వల్ల మానసిక ఉల్లాసం ఉత్సాహంతో పాటు శారీరక దృఢత్వం మెరుగుపడతాయని అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండేందుకు క్రమశిక్షణతో పాటు భవిష్యత్తులో సర్టిఫికెట్ ప్రతి ఒక్కటి ఉపయోగకరంగా ఉంటుందని అప్పుడు మేము ఫ్యాషన్ గా నేర్చుకున్న శిక్షణ దినదిన అభివృద్ధి పొందుతూ ఇప్పుడు రాష్ట్ర ఒలంపిక్ కమిటీలు ఇంటర్నేషనల్ ఎంపీ కమిటీలో స్థానం పొందడం అదృష్టంగా భావిస్తున్నామని ఏషియన్ గేమ్ లో కూడా కరాటేని గుర్తించి మన తెలంగాణ రాష్ట్రం నుండి కూడా క్రీడాకారులు పాల్గొనడం మన తెలంగాణ క్రీడాకారుల్లో ఒకరికి బ్రౌన్జ్ మెడల్ రావడం హర్షించదగ్గ విషయమని



తెలియజేశారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు యు. శ్రీనివాస్ , ఐడియల్ గ్రామర్ స్కూల్ , నలంద గ్రామర్ స్కూల్ 20 సంవత్సరాలు పైగా కరెక్ట్ గా శిక్షణ ఇస్తూ వారు ఎంతోమంది క్రీడాకారులను ఈ పాఠశాల ద్వారా అభివృద్ధి చేసేందుకు పాత్ర పోషించారని వారికి నా సంస్థ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . ఈ బెల్టు గ్రేడింగ్ టెస్టు లో పాల్గొన్న సీనియర్ కరాటే మాస్టర్ వెంకటేష్ , వెంకటేష్ , పవన్, గీతేశ్వర్ పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై సంబరాలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : సిరిసిల్ల నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ, సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పటాకులు పేల్చి స్వీట్లు పంపిణీ చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు చిరం నాగరాజు, నెత్తట్ల లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డితో పాటు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, గుండాటి రామ్‌రెడ్డి, నంది కిషన్, పందిర్ల శ్రీనివాస్, తేజ శ్రీనివాస్, రాజ్‌కుమార్, గోపాల్, శ్రీపాల్ రెడ్డి, సాయి రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, కోనేటి పోచయ్య, కోనేటి శ్రీనివాస్, రాజిరెడ్డి, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, వంగ శ్రీకాంత్ రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండే శ్రీనివాస్, గంట అంజయ్య, గొల్లపల్లి లక్ష్మారెడ్డి, గణపతి నాయక్, నరేందర్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



## 1,01,000లకు గణనాథుని లడ్డూ కైవసం

### వర్మణి సతీష్ సౌజన్య దక్కించుకున్నారు

అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్ : శంషాబాద్, సెప్టెంబర్ 24: జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని హుడా కాలనీలో అయోధ్య గ్రౌండ్‌లో హనుమాన్ టెంపుల్ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. ఈ వేలం పాటలో వర్మణి సతీష్ సౌజన్య రూ.1,01,000లకు గణనాథుని లడ్డూను కైవసం చేసుకున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు నిత్య పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, భక్తులు గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. లడ్డూను రూ.1,01,000లకు కైవసం చేసుకున్న వర్మణి సతీష్ సౌజన్యకు గణనాథుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని నిర్వాహకులు, భక్తులు ఆకాంక్షించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తం

### వినియోగదారులు విద్యుత్ భద్రతా జాగ్రత్తలు పాటించాలి: ఎస్ఈ ఎం. శ్రీనివాస్.

### భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (అరుణప్రభ): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. రాజన్న సిరిసిల్ల సర్కిల్ పరిధిలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాను పర్యవేక్షిస్తున్నారని సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతిన్నా, చెట్లు విద్యుత్ లైన్లపై పడినా వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలపై 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్ 18004250104 లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దన్నారు. వర్షం సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలను తాకరాదని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకూడదని సూచించారు. తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, మీటర్ బోర్డులు, మోటార్లు, గీజర్లు, కూలర్లు తదితర పరికరాలను తాకరాదన్నారు. నాణ్యమైన ఎర్తింగ్ ఏర్పాటు



చేసుకోవడంతో పాటు ఐఎస్ఐ ప్రమాణాలున్న పరికరాలు, వైర్లు, ఛార్జర్లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. దెబ్బతిన్న వైర్లను వెంటనే మార్చించి, విద్యుత్ మరమ్మతులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తోనే చేయించుకోవాలని సూచించారు. రైతులు మోటార్లు, స్టార్టర్లు, వైర్లు, పంపుసెట్లను పరిశీలించిన తర్వాతే వినియోగించాలని, తడి పరిస్థితుల్లో విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం వంటి పనులు చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్ లైన్ల కింద ఇనుప పైపులు, వ్యవసాయ యంత్రాలు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవద్దని తెలిపారు. పిల్లలను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఆడనివ్వకూడదని, పశువులను వాటికి కట్టరాదని సూచించారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని నేరుగా చేతులతో తాకకుండా, విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ ప్రసారం చేయని వస్తువుతో అతడిని వేరు చేసి వెంటనే వైద్య సహాయం అందించాలని తెలిపారు. “విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండండి.. సురక్షితంగా జీవించండి.. సురక్షితంగా వ్యవసాయం చేయండి” అని ఎస్ఈ ఎం. శ్రీనివాస్ ప్రజలకు సూచించారు.

# సిరిసిల్లలో సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజలు కూర్చునే ప్రదేశాలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మహేష్ బి. గీతేతో ఆది శ్రీనివాస్ చర్చించారు. సభ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## తుర్కయంజాల్‌లో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

### అధికారులకు దిశానిర్దేశం చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి

### అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచనలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో చివరి ఘట్టమైన నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. తుర్కయంజాల్ చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను అధికారులు, పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చే గణనాథులను ఇక్కడ నిమజ్జనం చేస్తున్నందున... ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నీరు ఎక్కువగా ఉన్నందున ఎవరినీ లోపలికి అనుమతించవద్దని చెప్పారు. పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువుకట్టపై ట్రాఫిక్ నియంత్రణ, గణనాథుల నిమజ్జనం, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై అధికారులకు, పోలీసులకు మల్‌రెడ్డి పలుసూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే చెప్పారు.



## సుందరయ్యనగర్‌లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

ఎల్లారెడ్డి పేట అరుణప్రభ. సెప్టెంబర్ 24: సిరిసిల్ల పట్టణంలోని 35వ వార్డు పరిధి లో గల సుందరయ్యనగర్-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీడీపీఓ ఉమారాణి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సాహితి, వార్డు కౌన్సిలర్ బత్తుల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వడంతో పాటు తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి చిన్నారికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందిస్తున్న అదనపు పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ స్వప్న, సఖి సెంటర్ కోఆర్డినేటర్ రోజా, అంగన్వాడీ కార్యకర్త శ్రీరామోజీ లలిత, పబ్లిక్ హెల్త్ మేనేజర్ బి.వాణి, ఏఎన్ఎం రేణుక, ఆశ కార్యకర్త పుష్ప, ఆర్పీలు భాగ్యలక్ష్మి, మనస, రేష్మతో పాటు గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో సిరిసిల్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

### అనుమతులు మంజూరు చేయడంపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మీడిదొడ్డి భానుకుమార్ హర్షం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : సిరిసిల్ల జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు రూ.200 కోట్లతో అనుమతులు మంజూరు చేయడం పట్ల ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మీడిదొడ్డి భానుకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా సిరిసిల్లలో ఈ పాఠశాల ఏర్పాటు కానుండటం జిల్లాకు సువర్ణ అధ్యాయమని భానుకుమార్ పేర్కొన్నారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు మెరుగైన వసతులు, క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. సిరిసిల్లకు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి విద్యార్థులు, యువత తరఫున భానుకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సిరిసిల్ల ప్రజలు ఎదురుచూస్తున్న విద్యా సంస్థ కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాల ద్వారా సిరిసిల్ల ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని భానుకుమార్ తెలిపారు.



## ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

### ఆసుపత్రుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీలు

అరుణప్రభ మహబూబాబాద్ న్యూస్ సెప్టెంబర్.24 : మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్‌లి వైద్య సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. ఆసుపత్రుల్లో Fire Safety, Bio-Medical Waste Management, Pollution Control తదితర సంబంధిత ధృవపత్రాలు, ఆసుపత్రి చార్జీల వివరాలు, సిబ్బంది వివరాలు, వైద్యుల వివరాలు మరియు ఇతర అవసరమైన రికార్డులను పరిశీలించారు. అలాగే ఆసుపత్రులలో నిర్వహిస్తున్న వైద్య రికార్డులు, ల్యాబొరేటరీ రికార్డులు తదితర రికార్డులను పరిశీలించి, వాటిని నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని సూచించారు ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ లో పేర్కొన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సరైన రిజిస్ట్రేషన్ మరియు అనుమతులు లేకుండా ఆసుపత్రులను నిర్వహిస్తే, వాటిని సీజ్ చేయడంతో పాటు చట్టంలోని నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆసుపత్రుల నిర్వాహకులను హెచ్చరించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో డాక్టర్ విరాజిత, డిప్యూటీ డెమో టి.రాజ్‌కుమార్, అనిల్ కుమార్, ప్రశాంత్ మరియు సత్య పాల్గొన్నారు



## బొప్పాపూర్ హైస్కూల్‌లో మొక్కలు నాటిన సర్పంచ్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలను సంరక్షించాలని ఈ సందర్భంగా సూచించారు. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శుక్రవారం, సెప్టెంబరు 25, 2026

# పేదరికాన్ని దాటి క్రికెట్‌లో రాష్ట్రస్థాయికి అక్షర

### తెలంగాణ అండర్-19 జట్టుకు ఎంపిక..
### కాశ్మీర్‌లో జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం.
### అక్షరను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రూ.30 వేల ఆర్థిక సాయం.



ఎల్లారెడ్డి పేట అరుణప్రభ : పేదరికం ఆమె క్రికెట్ కలకు అడ్డుకాలేదు.. పట్టుదల, ప్రతిభ, కఠోర శ్రమతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన బత్తుల అక్షర తెలంగాణ అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికై తన ప్రతిభను చాటుకుంది. బత్తుల నర్సింలు, లక్ష్మి దంపతుల కుమార్తె అక్షర. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆమె మల్లారెడ్డిపేట ఎంపీపీఎస్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు, అనంతరం మల్లారెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంది. దమ్మన్నపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యను అభ్యసించే సమయంలో క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుంది.

**జిల్లా జట్టు నుంచి రాష్ట్ర జట్టుకు...**

మోడల్ స్కూల్‌లో చదువుతున్న సమయంలో కోచ్ ప్రసాద్ ప్రోత్సాహంతో అక్షర క్రికెట్‌లో శిక్షణ పొందింది. అనంతరం సిరిసిల్లలో పీడీ డేవిడ్ వద్ద శిక్షణ తీసుకుంది. ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ తొలుత కరీంనగర్ జిల్లా అండర్-19 జట్టుకు ఎంపికైంది. వివిధ జిల్లాలతో జరిగిన పోటీల్లో పరుగులు చేయడంతో పాటు వికెట్లు తీస్తూ తన ప్రతిభను చాటుకుంది. తాజాగా తెలంగాణ అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడే అవకాశాన్ని దక్కించుకుంది. అక్టోబర్ చివరి నుంచి నవంబర్ వరకు కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనుంది.

**నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ప్రతిభ.**

అక్షర తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. వారికి పెద్దగా భూములు, ఆస్తులు లేవు. ఉపాధి హామీ పనులు, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రభుత్వం అందించే ఉచిత రేషన్ బియ్యంపైన కూడా ఆధారపడే పరిస్థితి ఉంది. అలాంటి ఆర్థిక పరిస్థితుల నుంచి వచ్చిన అక్షర క్రికెట్‌లో రాష్ట్ర స్థాయికి ఎదగడం ఆమె పట్టుదలకు, ప్రతిభకు నిదర్శనమని గ్రామస్థులు, తెలంగాణ ఉద్యమకారులు పేర్కొంటున్నారు.

**క్రికెట్ కలకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదు.**

క్రికెట్‌లో రాణించాలంటే బ్యాట్, క్రికెట్ కిట్, షూస్, ఇతర క్రీడా సామగ్రితో పాటు శిక్షణ, ప్రయాణ ఖర్చులు కూడా అవసరం. నిరుపేద కుటుంబానికి ఈ ఖర్చులను భరించడం భారంగా మారుతోంది. దీంతో అక్షర క్రికెట్ ప్రయాణానికి ఆర్థికంగా అండగా నిలవాలని పలువురు పిలుపునిస్తున్నారు. "అక్షర ప్రతిభను ప్రోత్సహించడం మనందరి బాధ్యత. ఆమె ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదు. ఆర్థికంగా సహాయం చేయగలిగిన వారు ముందుకు వచ్చి అక్షరను ప్రోత్సహించాలి. ఈ రోజు అందించే చిన్న సహాయం భవిష్యత్తులో ఆమెకు గొప్ప అవకాశాలకు బాటలు వేయవచ్చు" అని తెలంగాణ ఉద్యమకారులు కోరుతున్నారు.

**తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో రూ.30 వేల సాయం.**

అక్షర ప్రతిభను గుర్తించి తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించి రూ.30,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అక్షర జాతీయ స్థాయిలో మరింత రాణించి భవిష్యత్తులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అక్షరకు సహాయం చేయదలచిన దాతలు కుటుంబ సభ్యులు అందించిన బ్యాంకు ఖాతాకు ఆర్థిక సహాయం అందించవచ్చని తెలిపారు.

బ్యాంకు వివరాలు: ఖాతా నంబర్: 40372462088

IFSC: SBIN0020295, బ్యాంకు: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI), శాఖ: గంభీరావుపేట.

మల్లారెడ్డిపేట గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన అక్షర మరింత ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామం, రాజన్న సిరిసిల్ల జిల్లా, తెలంగాణకు పేరు తీసుకురావాలని గ్రామస్థులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో అక్షర అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వారు శుభాకాంక్షలు తెలిపారు.

# జోనల్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

### ఇబ్రహీంపట్నంలో నెరవేరనున్న మినీ స్టేడియం కల
### గురునానక్ కళాశాల వద్ద ఆరున్నర ఎకరాల్లో ప్రతిపాదనలు



అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : పిల్లల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం విద్యార్థుల భవిత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు తెలిపారు. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' జోనల్ స్థాయి పోటీలు ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్ వేదికగా ఆయన ప్రారంభించారు. క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు... వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పరేడ్ మార్చ్‌తో ఘనస్వాగతం పలికారు. పిల్లల గౌరవవందనం స్వీకరించిన మల్‌రెడ్డి..., జెండా ఊపి, క్రీడల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మల్‌రెడ్డి రంగారెడ్డి గారు... సమాజమార్పు విద్యతోనే సాధ్యమని చెప్పారు. ఇందుకోసమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మారుమూల ప్రాంతం, అట్టడుగు వర్గాలకు సైతం నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఫ్యూచర్‌సిటీలో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో విద్యావిప్లవానికి ఆరుట్ల నుంచే శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పిన మల్‌రెడ్డి... తల్లిదండ్రుల కలల్ని పిల్లలు సాకారం చేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పలువిజ్ఞాపనలను స్వీకరించిన ఎమ్మెల్యే... స్పోర్ట్స్ యూనిఫాం, ఇతర సౌకర్యాల కల్పనకు హామీఇచ్చారు. అంతేకాకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మినీ స్టేడియం ఏర్పాటు దశాబ్దాల కళ ఎట్టకేలకు తీరనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి స్థల పరిశీలన చేశారు. గురునానక్ కళాశాల ఎదురుగా సర్వేనెంబర్ 320లో గల స్థలాన్ని ఆయన పరిశీలించారు ఆరున్నర ఎకరాల స్టేడియం కు కేటాయింపు ప్రభుత్వానికి ప్రతిపదనాలు పంపాలని ఆర్డిఓకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు, ఎంఈఓ హీర్య నాయక్, గురుకుల విద్యాపీట్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, రాఘవరెడ్డి, జోనల్ సెక్రెటరీ అప్ప , పీఈటి పీడీలు సుశీల, రాజు, యాదమ్మ, కవిత, అంజి, రాజశేఖర్, వినయ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ హాస్టల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



### విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సంఖ్య, వారి హాజరు వివరాలను అడిగి తెలుసుకుని హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లోని మెనూ చార్ట్‌ను పరిశీలించిన కలెక్టర్, కిచెన్, గోదాంలో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల వసతి గదులను పరిశీలించి హాస్టల్ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు హాస్టల్‌లో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ తమ లక్ష్యాలను చేరుకునే దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# దిండిలో ఎస్‌జిఎఫ్ డివిజన్‌స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే



అరుణ ప్రభ ,డిండి ,సెప్టెంబర్ 24,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా దేవరకొండ డివిజన్ క్రీడలను గురువారం దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ స్థానిక జడ్పీ హైస్కూల్ గ్రౌండ్లో జ్యోతిని వెలిగించి ప్రారంభించారు .దేవరకొండ డివిజన్లోని ఎనిమిది మండలాల నుంచి క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్, కోకో ,బాల బాలికల జట్లు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చూపి, నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను డివిజన్ స్థాయి జట్టుకు ఎంపిక చేసి, జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని డివిజన్ క్రీడలకు కన్వీనర్ ఐ జయమ్మ ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు.విద్యార్థులచే మార్చి పాస్ట్ నిర్వహించే ప్రతిజ్ఞ చేయించారు.జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే బాలు నాయక్ ,, క్రీడా పతాకాన్ని తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ ఎగురవేశారు.ఈ సందర్భంగా స్థానిక ఆర్పి ఆర్పి పాఠశాల విద్యార్థి నిలచే ఆలపించిన నృత్యం క్రీడాకారులను, అతిథులను ఆకట్టుకుంది.ఈ సమావేశానికి జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతాంజలి రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలకు కావలసిన మౌలిక వసతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక హై స్కూల్ కు కావలసిన మౌలిక వసతులను తాను గుర్తించా నని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, దేవరకొండ డివిజన్లో క్రీడా అకాడమీ నెలకొల్పుటకు కృషి చేస్తానని ,అదేవిధంగా సెప్టెంబర్ 30న జరగబోయే జిల్లా స్థాయి క్రీడలను దేవరకొండ పట్టణంలో నిర్వహించుటకు కృషి చేస్తానని అన్నారు.క్రీడాకారులు క్రమశిక్షణతో, ఎంపైర్ల నిర్ణయాన్ని కట్టుబడి, క్రీడల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాజట్లకు ఎంపిక కావాలని సూచించారు.దేవరకొండ డివిజన్లోని ఎనిమిది మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులైన బాలబాలికలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు .గురువారం బాలురు బాలికల అండర్ 17 క్రీడా పోటీలు నిర్వహించినట్లు, శుక్రవారం అండర్ 14 బాలబాలికల జట్లకు క్రీడా పోటీలు ఉంటాయని ,క్రీడల కో కన్వీనర్ జే చంద్రయ్య ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేజన్మ .ఎంఈఓ నరసింహ,,సిఐ బిసన్న, ఎస్సై బాలకృష్ణ ,స్థానిక సర్పంచ్ నల్ల గంతుల రవి, ఉప సర్పంచ్ కౌసర్ రషీద్, ఎంపీ ఓ జంగయ్య, దిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు, యాదగిరిరావు, చింతలపూడి భాస్కర్ రెడ్డి, హనుమంతు వెంకటేష్ గౌడ్,, గుర్రం రాములు, కిన్నెర హరికృష్ణ ,మీసాల రామచంద్రయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మండలంలోని సర్పంచులు కొసిరెడ్డి రాజేందర్ రెడ్డి, కిషన్ నాయక్, మండలంలోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు నవనీత ,జ్యోతి, యాదయ్య ,శ్రీనయ్య, ఇద్దయ్య , రంగా నాయక్, బాబు నాయక్ ,రవి నాయక్, తిరుపతయ్య, వి శేఖర్ రెడ్డి ,,రామారావు, నూకం వెంకటేష్, శైలేష్, బాద మోని శ్రీనివాస్ గౌడ్, పోలా వెంకటేష్, మూడవత్ మల్లేష్ నాయక్, ఎదురు ఆనంద్, మండలంలోని ఉపాధ్యాయులు క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

### 13 రోజులుగా ప్రత్యేక పూజలు..
### 26న అన్న సమారాధన.. 27న వినాయక విగ్రహ నిమజ్జనం

కూకట్‌పల్లి సెప్టెంబర్ 24(అరుణ ప్రభ)మన అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 13 రోజులుగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 26న శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన నిర్వహించనున్నారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. అనంతరం ఈ నెల 27న ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. 13 రోజులుగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా మన అసోసియేషన్ తరఫున భక్తులు, స్థానికులు, సోదర సోదరీమణులు, శ్రేయోభిలాషులందరినీ కార్యక్రమాలకు ఆత్మీయంగా ఆహ్వానిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి యక్కంటి వెంకటరెడ్డి తెలిపారు. కుటుంబ సమేతంగా పాల్గొని వినాయకుడి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## ఎస్‌పి రెసిడెన్సీ వినాయకుడి లడ్డు @ రూ.1,52,116

### దక్కించుకున్న శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజగం కేశవులు



శేర్లింగంపల్లి: సెప్టెంబర్ 24 (అరుణ ప్రభ) : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ ఎస్ పి రెసిడెన్సీ వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నిమజ్జన ఊరేగింపులో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రెసిడెన్సి వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరకు శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజగం కేశవులు కుటుంబ సభ్యులు రూ.1,52,116/- కు లడ్డూ కైవసం చేసుకున్నారు. ఈ సంద ర్భంగా బెజగం కేశవులు మాట్లాడుతూ.. ఇప్పటికే వెస్ట్ మారేడ్ పల్లి సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలోని గణనాథుడి లడ్డును రూ.1,35,000/- దక్కించుకోవడం జరి గిందని, తాజాగా మేము నివాసముండే ఎస్పీ రెసిడెన్సీ వినాయకుడి లడ్డూను కైవసం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్సి వాసులు చింతకింది డాకాయ్య గౌడ్, మహేందర్ గౌడ్, నర్సింలు, వేణుగోపాల చారి, శ్రవణ్ చారి, ఎల్లేష్, రాజశేఖర్ రెడ్డి, స్వాతి, మీన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## 1,67,000లకు సిద్ధాంతి కాలనీ గణపతి లడ్డూ కైవసం

### లడ్డూను దక్కించుకున్న కుక్కల కృష్ణ

అరుణప్రభ - శంషాబాద్ జోన్ : శంషాబాద్, సెప్టెంబర్ 24: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శంషాబాద్‌లోని సిద్ధాంతి కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, శ్రీ కుక్కల కృష్ణ రూ.1,67,000లకు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధాంతి ఉత్సవ కమిటీ సభ్యులు కుక్కల కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు, కాలనీ వాసులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సిరిసిల్లలో యంగ్ ఇండియా స్కూల్‌కు అనుమతులు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : సిరిసిల్లలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం పట్ల ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూడిది రాజేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రజల చిరకాల కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జ్ కే.కే. మహేందర్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రతి రైతు గుర్తింపు కార్డు తీసుకోవాలి

అరుణప్రభ 24 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ మండలంలోని నడివాడ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఫార్మా రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి రైతు రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) వ్యవసాయ శాఖ ద్వారా నమోదు చేసుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి పథకాలకు మరియు ఎరువులు పొందాలంటే రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి అని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా స్వతహాగా తమ ఆధార్ నెంబర్ మరియు భూమి వివరాలు నమోదు చేసుకుని ఎరువులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డివిజన్ ఏడిఏ అజ్మీర శ్రీనివాసరావు, టెక్నికల్ ఏవో బి. రాంజీ, గ్రామ సర్పంచి మైదాశీ విజయకుమార్ రైతులు పాల్గొన్నారు

# నెల్లూరును కరవు జిల్లాగా ప్రకటించాలి 20కోట్లు నిధులు కేటాయించాలి

## సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): నెల్లూరు జిల్లాను కరువు ప్రాంతశీగా ప్రకటించాలని రైతులకు రుణమాఫీ, కౌలు రైతులకు నష్టపరిహారం, అన్ని పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని, సి.పి.ఎం పార్టీ నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. కరువు పరిశీలనా బృందం జిల్లా పర్యటనలో భాగంగా కరువు బృందం నాయకులు గురువారం గూడూరు సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పొదలకూరు,రాపూరు, సైదాపురం, మండలాల్లో రైతులు పంట పొలాలను పరిశీలించడం జరిగిందని, బొప్పాయి చెట్లు వైరస్ షోకి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, నిమ్మ రేట్లు పడిపోయాయని, కండలేరులో సాలినన్ని నీళ్లు లేవని ఒకపక్క కరువు మరోపక్క నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని బియ్యం కేజీ 70 రూపాయలు, చక్కెర 72 లకు చేరుకొన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఈరోజుకి కూడా గ్రామీణ ప్రాంతాల్లో, మండల ప్రాంతాల్లో సందర్శించిన దాఖలాలు లేవని, ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ ఉంది.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాని,పవన్ కళ్యాణ్ కాని,ప్రకటనలకే పరిమితం కాకుండా జిల్లాకి సహాయక చర్యల్లో భాగంగా 20 కోట్లు నిధులు కేటాయిస్తే తప్ప ఈ జిల్లా రైతాంగానికి సమస్యలు పరిష్కారం కావని,"ఎల్ నినో" ప్రభావంతో రైతులు వరి అయితే పూర్తిగా దెబ్బతిని పోయిందని, ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి జాతీయ విపత్తుగా పరిగనించి రాష్ట్రానికి లక్ష కోట్లు కేంద్ర నుంచి రాబడితే, తప్ప రైతాంగ సమస్యలు తీరవని "ఎల్ నినో" ప్రభావంగా రైతులు ఎదుర్కొనే దానికి సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని రాష్ట్రంలో సి.పి.ఎం పార్టీ పలు సమస్యలపై మూడు బృందాలుగా తిరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పై సమస్యలు పరిష్కారశీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని ఆయన డిమాండ్ చేశారు. సి.పి.ఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం మోహన్ రావు లు మాట్లాడుతూ కరువు పరిశీలనా బృందం పరిశీలనలో సైదాపురం లో బావులు, చెరువులు పూర్తిగా ఎండి పోయాయని,కరువు కాలుష్యం ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించకుండా కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఎక్కడైతే పంటలు దెబ్బతిన్నాయో ప్రీమియం భీమా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, పంటల రుణాల్ని రైతులకు వెటనే రద్దు చేయాలని కరువు మండలాలు ప్రకటించాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.పుల్లయ్య, మన్నూరు భాస్కరయ్య, సి.పి.ఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, జిల్లా అవాజ్ కమిటీ సభ్యులు ఎస్కే. రషీద్, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు జోగి.శివకుమార్, పి.శ్రీనివాసులు, గూడూరు సి.ఐ.టి.యు పట్టణ కార్యదర్శి బి.వి.రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి. నారాయణ, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు కోలాటం డ్రెస్సుల బహుకరణ సమ్మి గౌడ్

### ఇచ్చిన మాట ప్రకారం కోలాటం డ్రెస్సులు అందించిన కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్

### కాళోజి నగర్ గణేష్ మిత్రమండలి ఉత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమం

### జెనిగల అనూష-అనిల్ కుమార్ శాశ్వత సౌండ్ సిస్టం (డీజే) బహుకరణ

### సమ్మయ్య గౌడ్ సహకారాన్ని అభినందించిన మిత్రమండలి సభ్యులు



అరుణప్రభ సెప్టెంబరు 24: ఉప్పరపల్లి కాళోజి నగర్‌లో గణేష్ ఉత్సవాల సందర్భంగా ఆడబిడ్డలకు కోలాటం డ్రెస్సులను కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ బహుకరించారు. కాళోజి నగర్ గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. గతేడాది గణేష్ ఉత్సవాలకు హాజరైన సమ్మయ్య గౌడ్.. ఆడబిడ్డలు కోలాటం ఆడుతుండటాన్ని చూసి వచ్చే ఏడాది కోలాటం డ్రెస్సులు అందిస్తానని అప్పట్లో మాట ఇచ్చారు. ఏడాది గడిచినా ఆ మాటను గుర్తుపెట్టుకుని, ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం డ్రెస్సులను బహుకరించారు. దీంతో ఆడబిడ్డలు, మిత్రమండలి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. గతేడాది ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. గణేష్ ఉత్సవాల్లో భక్తి కార్యక్రమాలతో పాటు కోలాటం వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆడబిడ్డలు ఉత్సాహంగా పాల్గొంటూ మన సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయమని తెలిపారు.

**"ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు"**

కాళోజి నగర్ గణేష్ మిత్రమండలి కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గతేడాది గణేష్ ఉత్సవాలకు వచ్చిన సందర్భంగా సమ్మయ్య గౌడ్ ఆడబిడ్డలకు కోలాటం డ్రెస్సులు అందిస్తానని చెప్పారని, ఈ ఏడాది అదే మాట ప్రకారం డ్రెస్సులు బహుకరించడం ఆనందంగా ఉందన్నారు. మాట ఇచ్చి మర్చిపోకుండా ఏడాది తర్వాత కూడా గుర్తుపెట్టుకుని నెరవేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్సవాలకు అందించిన సహకారానికి సమ్మయ్య గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జెనిగల అనూష--అనిల్ కుమార్ శాశ్వత సౌండ్ సిస్టం (డీజే)ను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి, ఉప సర్పంచ్ ఆవుల ఐలయ్య, కాళోజి నగర్ గణేష్ మిత్రమండలి అధ్యక్షులు ఆవుల రాజు (చందు), ఉపాధ్యక్షులు జెనిగల నరేష్, కార్యదర్శి గంగరబోయిన శ్రీను, కమిటీ సభ్యులు ఏర్పుల కృష్ణమూర్తి, జెనిగల నవీన్, ఆవుల సంతోష్, ఏర్పుల కుమారస్వామి, ఏర్పుల వెంకన్న, ఆవుల నవీన్, యాస వెంకట్రెడ్డి, కొమ్మనబోయిన రంజిత్, శాగంటి రాములు, గోనె మోహన్ రెడ్డి, మెండె రాకేష్, ఏర్పుల మహేష్, బోనగిరి యాకస్వామి, అల్లి రమేష్, నల్లగొండ ప్రభాకర్, ఆవుల శ్రీను, జెనిగల పిచ్చయ్య, బోనగిరి వీరయ్య, యానాల శ్రీను, జెనిగల వీరయ్య, నల్లగొండ సత్తయ్య, తోట బిక్షపతి, అల్లం శివ, జెనిగల కనకయ్య, ఆవుల కట్టయ్య, బోనగిరి రాగయ్య, నల్లగొండ మహేష్, మరాటి కొమురయ్య, బోనగిరి సారయ్య, ఏసల్ల సతీష్, ఆవుల కొమురయ్య, రాజు, యాకయ్య, సురేష్, సాయిలు, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిండిలో తొమ్మిదవ జాతీయ పోషణ మాసం




అరుణ ప్రభ ,డిండి, సెప్టెంబర్ 24 ,9 వ జాతీయ పోషణ మాసం కార్యక్రమ నిర్వహణలో భాగంగా గురువారం దిండి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిండి సెక్టార్ సూపర్వైజర్ ఎం రేణుక పాల్గొని మాట్లాడుతూ చిరుధాన్యాలు, సిరి ధాన్యాలు ,,ఆకుకూరలు,,కూరగాయలు, మాంసకృతుల ,,సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు .ప్రతి మహిళ పెరటి తోటలు పెట్టుకోవాలని, గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది.మరియు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ జి గ్రూప్ అధ్యక్షులు, కార్యదర్శి జయమ్మ, అనిత పాల్గొని మాట్లాడారు .ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్స్ సత్యవాణి, చంద్రకళ, లావణ్య ,సీసీ లక్ష్మయ్య, అకౌంటెంట్ శారద, కంప్యూటర్ ఆపరేటర్ పీటర్ ,వివో ఏలు, తదితరులు .




## ముక్క నారాయణమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

అరుణప్రభ 24 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ నియోజకవర్గం బొద్దుగొండ గ్రామ మాజీ సర్పంచ్ ముక్క లక్ష్మణరావు మాతృమూర్తి ముక్క నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, శ్రీమతి సత్యవతి రాథోడ్ బొద్దుగొండ గ్రామంలోని నారాయణమ్మ నివాసానికి చేరుకున్నారు,ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు, నారాయణమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు

# 3,77,116/-రూపాయలు పలికిన మల్లయ్య నగర్ కాలనీ గణపతి లడ్డు

### వేలంపాటలో లడ్డూను కైవసం చేసుకున్న కే భారతి - చంద్రశేఖర్ దంపతులు

### ఆనందోత్సాహాల మధ్య ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు





సెప్టెంబర్ 24, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధి మల్లయ్య నగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు, కాలనీ కాలనీవాసులు సమిష్టిగా లక్ష్మి గణపతి హోమం, కుంకుమ అర్చనలు, సరస్వతి పూజా, భజన, దేవి పరాయణం, మహా అన్న ప్రసాద వితరణ, సంస్కృతిక నృత్యాలతో నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగా నిర్వహించిన గణపతి లడ్డు వేలం పాటలో కె భారతి– చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు 3,77,116/–రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు కే చంద్రశేఖర్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో కాలనీ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. కమిటీ సభ్యులు కాలనీవాసుల సహాయ సహకారాలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో కాలనీని మరింత అభివృద్ధి చేసుకుంటూ, సమిష్టిగా మన పండుగలను ఘనంగా నిర్వహించుకుందామని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## హత్యకు గురైన వివాహిత కుటుంబానికి

# రూ.15 వేల ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : గత నెల పదిర గ్రామంలో జరిగిన విషాద ఘటనలో హత్యకు గురైన వివాహిత కుటుంబానికి పదిర గ్రామ సర్పంచ్ శ్రీమతి బోనాల మణెమ్మ తరఫున రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలికి ముగ్గురు చిన్నారులు ఉండటంతో వారి విద్యా అవసరాలకు కొంతమేర అండగా నిలిచేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని చిన్నారుల చదువుకు సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోనాల సాయికుమార్, బీజేపీ మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి, గోపన్నగారి కొమురయ్య, పద్మారెడ్డి, నర్సింలు, పిట్ల శృతి ఎల్లం, పరశు రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## టీమ్ వారియర్స్‌కు రూ.లక్ష విలువైన ట్రాలీ అందజేత

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : పదిర గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న టీమ్ వారియర్స్ సభ్యులకు గ్రామ సర్పంచ్ శ్రీమతి బోనాల మణెమ్మ రూ.1 లక్ష వ్యయంతో ట్రాలీని అందజేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా ట్రాలీ అవసరాన్ని గుర్తించిన సర్పంచ్ బోనాల మణెమ్మ ఈ సహకారం అందించారు. దీంతో టీమ్ వారియర్స్ సభ్యులు సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనాల సాయికుమార్‌తో పాటు కామిడి సందీప్, ప్రదీప్, తాళ్లపల్లి సాయి, అమరేందర్ రెడ్డి, మధు, సందీప్, బబ్లూ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎన్.ఎస్.ఎస్. డే

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా జాతీయ సేవ పథకం దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రామ్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ వెంకట ప్రసాద్, ఐ . క్యూ. ఏ.సి కో ఆర్డినేటర్ యశోద , జి.సురేంద్ర , రమణ రెడ్డి , వాసంతి అధ్యాపకేతర సిబ్బందివిద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండి సేవాభావాన్ని కలిగి ఉండాలని, ఈ సేవ అనుభవం వలన భవిష్యత్తు లో అనేక ఒత్తిడులను అధికమించవచ్చుని వక్తలు సూచించారు. మహాత్మా గాంధీ సేవాభావాన్ని ఆదర్శంగా తీసుకోని ఈ జాతీయ సేవ కార్యక్రమాన్ని గాంధీ శతజయంతి ఉత్సవ సంవత్సరమైనా 1969, 24 సెప్టెంబర్ న ఎన్. ఎస్ .ఎస్ దినోత్సవంగా జరుపుకుంటామని వక్తలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ .వాలంటీర్స్ కు ప్రశంస పత్రాన్ని అందచేయడం జరిగింది. కార్యక్రమ అనంతరం కళాశాల క్యాంపస్ లో ప్రిన్సిపాల్,అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు మొక్కలను నాటారు. చివరిగా జాతీయ గీతంతో ఈ కార్యక్రమం ముగిసింది.

### అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా

### "వయోవృద్ధుల సంక్షేమం మరియు సాధికారత వారోత్సవాల"

## పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్.24 : రాబోయే అక్టోబర్ 01న జరుపుకోనున్న "అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం--2026" సందర్భాన్ని పురస్కరించుకుని, "వయోవృద్ధుల సంక్షేమం మరియు సాధికారత వారోత్సవాల" ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ షబరీష్ గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో వయోవృద్ధుల స్థానానికి తగిన గౌరవం ఇవ్వడం, వారి ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ మరియు సాధికారతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు మరియు సేవలు వారికి సులభంగా అందుబాటులోకి తెచ్చి, వాటిని వినియోగించుకునేలా ప్రోత్సహించడం జరుగుతుందని పేర్కొన్నారు వయోవృద్ధుల భద్రత, సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ మరియు సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధుల సంక్షేమం, చట్టాలు, ఆరోగ్య సేవలు మరియు సాధికారతకు సంబంధించిన పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కె. అనిల్ కుమార్, జిల్లా అటవీ అధికారి లావణ్య, మహబూబాబాద్ మరియు తొర్రూరు ఆర్డీఓలు రాజేశ్వరీ, గణేష్, డీఆర్‌డీఓ మధుసూదన రాజు జిల్లా సంక్షేమ అధికారి శిరీష , డీపీఓ రేవంత్, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్ తొ పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# సాయి అనుశ్రీ నగర్లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

### మహాగణపతి లడ్డును పొందిన లక్ష్మీ వీరమల్లు కుటుంబ సభ్యులు





సెప్టెంబర్ 24,అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సాయి అనుశ్రీ నగర్లో వినాయక నవరాత్రు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగ నిర్వహించిన లడ్డు వేలం పాటలో తొమ్మిది రోజులు విశేష పూజలు అందుకున్న గణపతి మహా లడ్డును కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు, రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ లక్ష్మీ వీరమల్లు కుటుంబ సభ్యులకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారుగా 10 సంవత్సరాలనుండి కాలనీలో వినాయక ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని, వినాయక ఉత్సవాలలో భాగంగా కాలనీ సభ్యులు, కమిటీ సభ్యులు, మహిళా మణులు, ప్రత్యేక పూజలు, కుంకుమ అర్చన, మహా అన్న ప్రసాద వితరణ, నిర్వహించగా చిన్నారులు తమ అట పాటలతో సందడి చేస్తూ వినాయక నవరాత్రులు విజయవంతం చేశారని, అదేవ దేవుడు వినాయకుని ఆశీస్సులు అందరికి ఉండాలని వేడుకుంటూకమిటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, బాపురెడ్డి, వీర బాబు, మల్లికార్జున రావు, మధుకర్, కృష్ణయ్య, మీశ్రా, రాకేష్, యాదగిరి, సత్యనారాయణ, గిరి, నర్సింహా రావు, ఋషి గణేష్, సంతోష్, రమిత్, పురేందర్, సురేష్, సమ్మి రెడ్డి, సుదర్శన్, నవీన్ రెడ్డి, రత్నకర్ రెడ్డి, కాలనీవాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

### 25న ఉదయం 9 గంటల నుంచి

### నిర్వహణ.. పలు ప్రముఖ కంపెనీల పాల్గొనడం



గజ్వేల్,అరుణ ప్రభ : గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. శోభారాణి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు డ్రైవ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో హ్యుందాయ్, క్వెస్, ముత్తూట్ ఫైనాన్స్, డిజిటైడ్, ఎల్ఎంఎస్, శివమ్ టెక్నాలజీస్, మేరీనా పెయింట్స్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు 2024, 2025, 2026లో డిగ్రీ పూర్తి చేసిన వారు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ డ్రైవ్‌కు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెండు జతల రెజ్యూమ్‌లు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. గజ్వేల్ పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలు లేదా సందేహాల కోసం 8985710323 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# ఆనంద్‌నగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం



### ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్

సెప్టెంబర్ 23, అరుణ ప్రభ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్,బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో గణేష్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.కాలనీ వాసులు భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ నిమజ్జన శోభాయాత్రలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కాలనీ వాసులతో కలిసి ఊరేగింపులో భాగస్వాములయ్యారు.భక్తుల సందడి,డప్పుల మోత,గులాళ్ చల్లుతూ సాగిన నాట్యాలు,గణపతి నామస్మరణలతో కాలనీ వీధులన్నీ మారుమోగాయి. ఐక్యతకు ప్రతీక గణేష్ ఉత్సవాలు ఈ సందర్భంగా కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు కాలనీ ప్రజల మధ్య ఐక్యతను,సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా,ప్రశాంత వాతావరణంలో ఈ వేడుకలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు,మహిళలు,యువతతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు బతక శ్రీనివాస్,తలారి యాదగిరి,కావాలి శ్రీనివాస్,మరాఠీ సంపత్, జక్కుల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# కేకేఆర్ యాదవ్ వాషింగ్ సెంటర్ ప్రారంభం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్

### గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్–జగదేవ్‌పూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కేకేఆర్ యాదవ్ కార్ అండ్ బైక్ ఫోమ్ వాషింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొని వాషింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించి, నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా నాణ్యమైన వాహన శుభ్రత సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.



### వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన

# టీ.పీ.సీ.సీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : గురవారం తేది 25.9.2026.నాడు సదాశివపేటలోని ఊబ చెరువును శుక్రవారం నాడు జరగబోయే వినాయక నిమజ్జన్న సందర్భంగా ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పరిశీలించడం జరిగింది. అధికారులకు నాయకులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన ప్రసాద వితరణ



### భక్తిశ్రద్ధలతో గణనాథుని నవరాత్రి ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్ సర్కిల్ పరిధిలో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ గణనాధుని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జెనిగే ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణనాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు భక్తితో అన్నప్రసాదాన్ని అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. “అన్నదానం మహాదానం – సేవే పరమ ధర్మం” అనే స్ఫూర్తితో యూత్ అసోసియేషన్ సభ్యులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గణనాథుని నవరాత్రి ఉత్సవాలను భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు వేదికగా నిర్వహిస్తున్న నిర్వాహకులను స్థానికులు అభినందించారు. వినాయకుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాసాల వెంకటేష్ యాదవ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి స్థానిక నాయకులు భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ముదిరాజ్ సంఘం

## ఉపాధ్యక్షునిగా పందినేని. శ్రవణ్ ఏకగ్రీవ ఎన్నిక



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణ పురం గ్రామ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షునిగా పందిని శ్రవణ్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం సంక్షేమం అభివృద్ధికై అను నిత్యం అన్ని ఎల్లవేళలా పాటుపడతానని అందుబాటులో ఉంటా నాని సంగం శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటానని నాపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షుడిగా పదవి బాధ్యతలు అప్పగించిన లక్ష్మీనారాయణ పురం గ్రామ శాఖ అధ్యక్షులు యాట అశోక్ గ్రామ పెద్దలకు యువకులకు కుల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.



## బెజగామలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

### పిల్లలకు పోషకాహారం అందించడంపై అవగాహన

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజగామ గ్రామంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని అంగన్వాడీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెల్త్ సూపర్వైజర్ శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ భవాని మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలకు చిరుధాన్యాలు, మిల్లెట్స్, బాలామృతం తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. పోషకాహారంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నకిర్త గోపాల్, అంగన్వాడీ సూపర్వైజర్ భవాని, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గణపతి లడ్డూ కంటే కలశం చెల్లాకే అధిక ధర!

### ::: లడ్డూ 15 వేలు.. కలశం చెల్లా 16 వేలు

గజ్వేల్ అరుణ ప్రభ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ, కలశం చెల్లా వేలం పాటను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీవాసులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా వేలం పాట నిర్వహించారు. వేలంలో కొత్తపల్లి జగన్ గౌడ్ దంపతులు గణపతి లడ్డూను రూ.15 వేలతో కైవసం చేసుకున్నారు. అలాగే కొత్తపల్లి బాలమణి--ఎల్లాగౌడ్ దంపతులు కలశం చెల్లాను రూ.16 వేలతో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గణపతి లడ్డూ కంటే కలశం చెల్లాకు అధిక ధర పలకడం విశేషమని తెలిపారు. కలశాన్ని దక్కించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, విఘ్నేశ్వరుడి కృపతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆదర్శ యూత్ కమిటీ సభ్యులు, మహిళా సభ్యులు, చిన్నారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మైక్రాన్ లైఫ్ సైన్సెస్‌తో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం

### విద్యార్థులకు ఆధునిక

### ప్రయోగశాల నైపుణ్యాలపై ఆచరణాత్మక శిక్షణ

గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోటనీ, మైక్రోబయాలజీ విభాగాలు హైదరాబాద్‌కు చెందిన ఐఎస్ఓ 9001:2015 ధృవీకరణ పొందిన మైక్రాన్ లైఫ్ సైన్సెస్ సంస్థతో అవగాహన ఒప్పందం ( ఎం ఓ యు ) కుదుర్చుకున్నాయి. విద్యార్థులకు మాలిక్యులర్ బయాలజీలో ఆధునిక ప్రయోగశాల నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానంపై ఆచరణాత్మక శిక్షణ అందించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పీసీఆర్ (పీసీర్), ఎలక్ట్రోఫోరెసిస్, బ్లాటింగ్ టెక్నిక్స్, డీఎన్ఏ ఐసోలేషన్, క్రోమాటోగ్రఫీ టెక్నిక్స్ తదితర ఆధునిక ప్రయోగశాల పద్ధతులపై శిక్షణ అందనుంది. మొదటి పక్షంగా మైక్రాన్ లైఫ్ సైన్సెస్, హైదరాబాద్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ డా. రమేష్ కాండే, రెండో పక్షంగా కళాశాల బోటనీ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ వీరయ్య శీలం ఒప్పందంలో భాగస్వాములయ్యారు. సెప్టెంబర్ 24న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం, డా. రమేష్ కాండే పరస్పరం ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. అనంతరం డా. రమేష్ కాండే విద్యార్థులకు క్రోమాటోగ్రఫీ టెక్నిక్స్, యూకారియోట్స్‌లో పోస్ట్–ట్రాన్స్‌క్రిప్షన్, పోస్ట్-ట్రాన్స్‌లేషన్ మార్పులు అనే అంశాలపై ప్రత్యేక ఉపన్యాసం అందించారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్. సునీత (అసిస్టెంట్ ప్రొఫెసర్), శ్రీ జి. రమణారెడ్డి (లెక్చరర్), డా. అనూరాధ (లెక్చరర్), శ్రుతి (లెక్చరర్) తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com



# సేవా దృక్పథం పెంపొందించుకోవాలి

### ఎన్ఎస్ఎస్‌లో చేరి సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలి: ప్రిన్సిపాల్ డా. నిఖత్ అంజుమ్






గజ్వేల్ అరుణ ప్రభ : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో వాలంటీర్లుగా చేరాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) గజ్వేల్ ప్రిన్సిపాల్ డా. నిఖత్ అంజుమ్ సూచించారు. కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. నిఖత్ అంజుమ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవా భావం, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అమలాదేవి మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరో ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ ఎంతగానో ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. డా. ఎస్. మహేందర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు సంస్కారం, సేవా భావం అలవడుతాయని తెలిపారు. డా. పెద్దిరాజు మాట్లాడుతూ ప్రతి సామాజిక కార్యక్రమంలో యువత ముందుండి నాయకత్వం వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు వి. మార్కండేయ, ప్రభుత్వ పాలన శాస్త్ర అధ్యాపకురాలు డా. టి. కవిత, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులలో సేవా దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

# జీవశాస్త్రాల్లో అపారమైన కెరీర్ అవకాశాలు

### విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన డా. రమేష్ కాండే





గజ్వేల్ అరుణ ప్రభ : జీవశాస్త్రాల రంగంలో ఉన్నత విద్య, పరిశోధన, బయోటెక్నాలజీ, ఔషధ పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లో విస్తృతమైన కెరీర్ అవకాశాలు ఉన్నాయని మైక్రోన్ లైఫ్ సైన్సెస్ సీఈఓ డా. రమేష్ కాండే పేర్కొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో "బయో ఫ్యూచర్స్: జీవశాస్త్రాల్లో కెరీర్ అవకాశాలు" అనే అంశంపై గురువారం విస్తరణ ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. నిఖత్ అంజుమ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జీవశాస్త్ర రంగంలో అందుబాటులో ఉన్న విభిన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. బోటనీ, బయోటెక్నాలజీ విభాగాధిపతి జి. విజయ బాస్కర్ రెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా జీవశాస్త్రాల్లో ఉన్నత విద్య, పరిశోధన, బయోటెక్నాలజీ, ఫార్మా పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లోని అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య వక్త డా. రమేష్ కాండే జీవశాస్త్ర రంగంలోని ప్రస్తుత ధోరణులు, పరిశ్రమల అవసరాలు, ఉన్నత విద్య, పరిశోధన, వ్యవస్థాపకత, ఉపాధి అవకాశాలపై సమగ్రంగా వివరించారు. విద్యార్థులతో నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. భవిష్యత్ కెరీర్ ప్రణాళికపై విద్యార్థులకు స్పష్టత కల్పించేలా ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ముఖ్య వక్తకు కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం ముగిసింది.

# దువ్వూరు సుజాతమ్మ ,మండల ప్రజా పరిషత్ ప్రసిడెంట్ (దొరవారిసత్రం మండలం) గారికి వీడ్కోలు మహాసభ







(దొరవారిసత్రం మండలం, అరుణప్రభ దిన పత్రిక) : దొరవారిసత్రం, సెప్టెంబర్ 23. తిరుపతి జిల్లా, దొరవారిసత్రం మండలం, దొరవారిసత్రం కార్యాలయం ఆవరణలో శ్రీ కె. గోవర్ధన్, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గారి అధ్యక్షతన శ్రీమతి దువ్వూరు సుజాతమ్మ, దొరవారిసత్రం మండల ప్రజా పరిషత్ ప్రసిడెంట్ గారికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం అదకారులు మరియు మండల నాయుకులు,ఘణంగాపూలమాలలతో మరియు సాలవాలతో సత్కరించి వీడ్కోలు మహా సభను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో శ్రీమతి దువ్వూరు సుజాతమ్మ గారు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరముల కాలంలో ఎన్నో వడిదుడుకులు వెదుర్కున్నప్పటికి పరిపాలన సక్రమంగా నిర్వహించగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాను. మండలంలో ప్రజా ప్రతినిధులు, మరియు ప్రభుత్వ అధికారులు అందించిన సహకారములతో దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం నందు 22 లక్షల రూపాయలతో సమావేశపు గది, మండల పరిషత్ కార్యాలయం పునర్నిర్మాణము, స్థానిక ఏం.ఎల్.ఏ గారి సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక కోటి అరవై లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణము, మండల గ్రాంట్ నిధులతో నాలుగు కోట్ల పన్నెండు లక్షల రూపాయలతో వివిధ రకాల పనులు చేపట్టి అభివృద్ధి, 15వ ఆర్థిక సంఘ నిధులు 2023-26 సంవత్సరము వరకు ఒక కోటి పదమూడు లక్షలతో చేతి బోర్లు మరియు పైపులైన్ల నిర్మాణము యొక్క వస్తువుల కొనుగోలు, జలజీవం మిషన్ ద్వారా పి.ఏం.జి .వై పథకాలు క్రింద ఆరు కోట్ల ఇరవై ఐదు లక్షల రూపాయలతో త్రాగునీటి పథకాలు ఏర్పాటు చెయ్యడం చాల గర్విస్తున్నానని తెలియజేసినారు. అదేవిదంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు, మరియు ప్రభుత్వ అధికారులు, మండల నాయుకులు అందించిన సహకారములకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు శ్రీ దువ్వూరు గోపాల్ రెడ్డి, వైస్.ఎం.పి .పి. శ్రీ.ఆర్.రాజేంద్ర ప్రసాద్, మండల తహసీల్దార్, శ్రీ కె.గోవర్ధన్, ఎం.పి.డి.ఓ గారు, శ్రీ రమణయ్య, డి.ఈ,పంచాయత్ రాజ్ గారు, శ్రీ హరి రెడ్డి, మార్కిటింగ్ సొసైటీ చైర్మన్, శ్రీ టి.రమేష్,జడ్.పి. టి.సి గారు మరియు గ్రామ సర్పంచులు, ఎం.పి.టి.సి.లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



## వినాయక మండపాలను సందర్శించిన తుప్పత్ ఆనంద్

### విఘ్నాలు తొలగాలని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

సెప్టెంబర్ 24, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.వినాయక చవితి 10వ రోజు ఉత్సవాలలో భాగంగా బిజెపి నాయకులు తుప్పత్ ఆనంద్ బోడుప్పల్, చెంగిచెర్ల డివిజన్ల పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ, సూరజ్ నగర్ కాలని, ఎం ఎల్ కాలనీ ఎస్ వై కాలనీలలోని శ్రీ గణపతి మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా మండపాల వద్ద నిర్వహించిన భజన కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుప్పత్ ఆనంద్ మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న వినాయక మండపాలను సందర్శించడం ఆనందంగా ఉందని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపతి మండప నిర్వహకులు పలు కాలనీలా అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## సీనియర్ల ఆశీస్సులు తీసుకున్న నూతన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు

అరుణ ప్రభ బడంగ్పేట్ రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన శ్రీమతి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ ఎంపీ శ్రీ మధుయాష్కి గౌడ్, అలాగే ఎంపీలు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, డా. మల్లు రవి లను వేర్వేరుగా కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా నేతలు ఆమెను శాలువాలతో సత్కరించి, జిల్లాలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.



## వేలంలో అత్యధిక ధర పలికిన హౌసింగ్ బోర్డు కాలనీ వినాయకుని లడ్డు

### 90 వేల 116 లకు కైవసం చేసుకున్న ఎడ్ల ప్రవీణ రమేష్

అరుణప్రభ 24 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో 90 వేల116 రూపాయలకు దక్కించుకున్న ఎడ్ల ప్రవీణా రమేష్ దంపతులు సందర్భంగా అర్చకులు మరియు కమిటీ సభ్యులు సన్నాయి మేళ తాళాల మధ్య వారి కుటుంబానికి లడ్డూ అప్పగించి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గణపతి ఆశీస్సులతో లడ్డును కైవసం చేసుకోవడం జరిగిందని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారుద



## ఖరీఫ్ పంటల కొనుగోళ్లకు పకడ్బందీ ప్రణాళిక

### రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఎల్లారెడ్డిపేట అరుణ ప్రభ : రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24: ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి పంటల కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. 2026--27 ఖరీఫ్ సీజన్‌లో పంటల కొనుగోళ్లకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 2.40 లక్షల మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ చివరి వారం నుంచి వరి ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. లారీల కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ ప్రకారం వాహనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అన్ని వాహనాలకు జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లకు అనుగుణంగా గన్నీ సంచులను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 4,335 టార్పాలిన్లు, 2 ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, 270 గ్రైన్ కాలిపర్స్, 333 తేమ యంత్రాలు, 630 ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, 270 హస్క్ రిమూవర్లు, 2 డ్రైయర్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన పరికరాలను సక్రమంగా వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుందని, సుమారు 4 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. పత్తి కొనుగోళ్లకు కూడా అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ పరీక్షలు, రవాణా, గన్నీ సంచులు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీఎం గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఈ 5 ఆహారాలు తీసుకుంటూ ఉంటే చాలు...!

కాలంతో పాటూ వాతావరణంలో కూడా మార్పు చోటు చేసుకుంటుంది. చలికాలం వచ్చినప్పుడు, చలికాలం నుండి వేసవి కాలం మొదలైనప్పుడు వాతావరణ మార్పుల వల్ల వివిధ రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. ఈ సీజనల్ సమస్యలు తాత్కాలికమే అయినా చాలా ఇబ్బంది పెడతాయి. వీటిని సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే వీటికి ధీటైన ఆహారాలు తీసుకోవాలి. వసంతకాలం వల్ల ఎదురయ్యే సీజనల్ సమస్యలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన సూపర్ ఫుడ్స్ వైపు ఓ లుక్కేస్తే..

**పాలకూర..**

పాలకూరలో రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు పుశ్కలంగా ఉంటాయి. విటమిన్ ఎ, సి, ఇ, అలాగే యాంటీఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు అంటువ్యాధులతో పోరాడటానికి, మొత్తం రోగనిరోధక పనితీరుకు తోడ్పడతాయి. పాలకూరను సూప్, సలాడ్, పప్పు ఇలా.. ఏ రూపంలో తీసుకున్నా మంచి ఆరోగ్య ప్రయోజనాలుంటాయి.

**స్ట్రాబెర్రీలు..**

స్ట్రాబెర్రీలు కేవలం రుచిగా ఉండటమే కాదు.. వీటిలో విటమిన్-సి కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది తెల్లరక్తకణాల అభ్భివృద్ధికి దోహదపడుతుంది. స్ట్రాబెర్రీలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిని నేరుగానే తినవచ్చు.

**బ్రోకలీ..**

క్రూసిఫరస్ జాతికి చెందిన బ్రోకలి పోషకాలకు పవర్ హౌస్. బ్రోకలీలో విటమిన్-ఎ, సి, ఇ ఉన్నాయి. అలాగే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, రోగనిరోధకశక్తి గుణాలకు ప్రసిద్ధి చెందిన సల్ఫోరాఫేన్ ను కలిగి ఉంటుంది. ఇది సహజంగా రోగనిరోధక వ్యవస్థను బలంగా మార్చుతుంది.

**వెల్లుల్లి..**

వెల్లుల్లి వంటలకు రుచిని, సువాసనను మాత్రమే కాదు.. బోలెడు ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. వెల్లుల్లిలో అల్లిసిన్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ మైక్రోబయల్, రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలు కలిగి ఉంటాయి. వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకుంటే జలుబు, ఫ్లూ, దగ్గు వంటి సీజనల్ సమస్యలు చాలా ఈజీగా తగ్గుతాయి. పైగా రోగనిరోధక శక్తిని కూడా బలంగా మార్చుతుంది.

**అస్పరాగస్..**

అస్పరాగస్ చలికాలం తరువాత బాగా అందుబాటులోకి వస్తుంది. ఇందులో విటమిన్-ఎ, సి, కె తో పాటూ ఫోలేట్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అంతేకాకుండా అస్పరాగస్ లో ప్రీబయోటిక్ ఫైబర్లు ఉంటాయి. ఇవి కూడా రోగనిరోధక శక్తి బలపరచడంలో సహాకరంగా ఉంటాయి.













# ఉదయాన్నే కాఫీ తాగే అలవాటుందా?

కాఫీ ఓ మంచి ఎనర్జీ డ్రింక్ అని చెప్పవచ్చు. చాలామందికి ఉదయాన్నే కాఫీ తాగందే ఓ పనులు మొదలు పెట్టే అలవాటు ఉండదు. కొందరు తలనొప్పిగా అనిపించినా, నీరసంగా ఉన్నా కాఫీ తాగి రిలాక్స్ అవుతారు. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో కాఫీ తాగడం ఎంతవరకు మంచిది అనే విషయం గురించి అడపాదడపా చర్చలు సాగుతుంటాయి. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల నష్టాలుంటాయని ఆహరనిపుణులు అంటున్నారు. కాఫీని ఉదయాన్నే తాగడం వల్ల కలిగే నష్టాలేంటి? ఓ లుక్కేస్తే.. కెఫిని ఉద్దీపన చెందిస్తుంది. చురుగ్గా ఉండటంలో తోడ్పడుతుంది. కాఫీలో కెఫీన్ కంటెంట్ బాగుంటుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కాఫీని తాగితే అది ఆందోళన సమస్యకు దారితీస్తుంది.కాఫీ ఆమ్ల స్వభావం కలిగి ఉంటుంది. కెఫీన్ ఎక్కువగా ఉండటం, ఆమ్ల స్వభావం కలిగి ఉండటం రెండింటి వల్ల కాఫీని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగితే అది క్రమంగా పెప్టిక్ అల్సర్, యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇది జీర్ణాశయ సమస్యలకు కూడా కారణం అవుతుంది. ప్రకోప ప్రేగు



సింద్రోమ్ లేదా ఇన్ఫ్లమేటరీ ప్రేగు వ్యాధి వంటి జీర్ణసంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారు ఖాళీ కడుపుతో కాఫీని అస్సలు తాగకూడదు. ఇది జీర్ణ సంబంధ సమస్యలు, విరేచనాలు, పొత్తి కడుపు తిమ్మిరి మొదలైన సమస్యలను కలిగిస్తుంది.కాఫీలో టానిన్లు ఉంటాయి. ఇవి ఐరన్, కాల్షియంతో సహా కొన్ని రకాల ఖనిజాలు, విటమిన్లు, పోషకాలను గ్రహించడంలో ఆటంకం కలిగిస్తాయి. ఖాళీ కడుపుతో కాఫీ తాగడం వల్ల రోజులో తీసుకునే ఆహారంలో పోషకాలు శరీరానికి అందడంలో ఇబ్బంది కలుగుతుంది. ఇది కాలక్రమేణా పోషకాహార లోపానికి దారితీస్తుంది.అడ్రినల్ గ్రంధుల నుండి ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ విడుదల అవుతుంది. ఖాళీ కడుపుతో కాఫీ తాగితే ఈ హార్మోన్ ఎక్కువ విడుదల అయ్యి ఒత్తిడి స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది.కెఫిన్ ఉదయాన్నే తీసుకుంటే ఇన్సులిన్ సెన్సిటివిటీని, గ్లూకోజ్ జీవక్రియను ప్రభావితం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగేలా చేస్తుంది. చక్కెర స్థాయిలు క్రాష్ అవ్వడానికి దారితీస్తుంది.కెఫిన్ మూత్రం ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. శరీరంలో తేమ శాతం కోల్పోవడానికి దారితీస్తుంది. శరీరం డీహైడ్రేషన్ కు గురయ్యేలా చేస్తుంది. ఇది తలనొప్పి, మైకం, అలసట వంటి సమస్యలు సృష్టిస్తుంది.

# మైగ్రెయిన్‌తో బాధపడుతున్నా? ఆ చికిత్స కరెక్టేనా?



మైగ్రెయిన్ పరీక్షల్లో బయటపడే సమస్య కాదు కాబట్టి, లక్షణాలను బట్టి, తీవ్రతలను బట్టి ఆ నొప్పిని అదుపులో ఉంచే చికిత్సను ఎంచుకోవలసి ఉంటుంది. ఈ పార్శ్వపు నొప్పి ఎంత తరచుగా వేధిస్తోంది, ఎంత తీవ్రంగా ఉంటోంది... మొదలైన అంశాల ఆధారంగా చికిత్స చేయవలసి ఉంటుంది. కేవలం నొప్పిని తగ్గించడమే కాకుండా, తరచూ తిరగబెట్టకుండా చేసే మందులు హోమియోపతిలో ఉన్నాయి. కొంత మందిలో ఈ మందులు మైగ్రెయిన్‌ను శాశ్వతంగా అరికడతాయి. అలాగే ఈ చికిత్సలో భాగంగా మైగ్రెయిన్‌తో పాటు అనుబంధంగా ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా కలిపి చికిత్స అందించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అయితే ఈ మందులను వైద్యుల సలహా మేరకే వాడుకోవాలి. హోమియోలో మైగ్రెయిన్‌కు ఉపయోగపడే మందులు ఇవే!

బెలడోన: అకాసాత్తుగా తీవ్రమైన నొప్పి మొదలై, కళ్లు, ముఖం ఎర్రబడతాయి. వెలుతురు చూడలేరు.

బ్రయోనియా: ఏమాత్రం కదిలినా తలనొప్పి ఎక్కవవుతూ ఉంటుంది. వెలుతురు, శబ్దం భరించలేరు. అతి దాహం ఉంటుంది. తలను అదిమినట్టు పట్టుకుంటే ఉపశమనంగా ఉంటుంది. జెల్సిమియం: తల బరువుగా ఉండడం, మెడ వెనక భాగం నుంచి నొప్పి మొదలవడం, తలలో పోట్లు, కళ్ల ముందు మెరుపులు కనిపించడం శాంగ్వినేరియా: కుడి వైపు తల నొప్పి, మెనోపాజ్ దశకు చేరుకున్న స్త్రీలలో కనిపిస్తుంది. స్పైజీలియా: ఎడం వైపు తల నొప్పి, గుండె దడ ఐరిస్ వర్స్: తల కుడి భాగంలో నొప్పి, చెవి, కణతలు పగిలిపోతున్నంత బాధ, నొప్పి సూర్యోదయంతో మొదలై, సూర్యాస్తమయంతో ఉపశమనం పొందుతారు. తూజా: ఎడమ కణతలో, తలలో నొప్పి, తలపై మేకులు గుచ్చినంత బాధ, వికారంలాక్ కేన్: తల నొప్పి ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకు మారుతూ ంటుంది.ఇగ్నీషియా: కోపం, దిగులు, దుర్వార్తలు తెలియగానే మొదలయ్యే తలనొపికాక్యులస్: ప్రయాణంతో వచ్చే తలనొప్పి, కాలీ ఫాస్, డామియానా, ఇపెకాక్ మొదలైన మందులతో కూడా ఫలితం ఉంటుంది.

# మధుమేహులు ఈ పండ్లు తీసుకుంటే ఆరోగ్యానికి మేలు



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని మధుమేహం బాధిస్తోంది. అనారోగ్యకర జీవనశైలి, వంశపారంపర్యంగా ఇలా కారణమేదైనా మధుమేహం ఎందరినో వెంటాడుతోంది. మధుమేహం బారినపడితే దీన్ని రివర్స్ చేయలేకున్నా సరైన నిర్ణయాలు, ఆరోగ్యం, వ్యాయామం ద్వారా అదుపులో ఉంచుకోవచ్చు. మధుమేహ నియంత్రణలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతుంటారు.మన ఆహారంలో ఏం చేర్చుకోవాలి, వేటికి దూరంగా ఉండాలనే దానిపై మధుమేహులకు పూర్తి అవగాహన ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రతిరోజూ ఓ యాపిల్ తింటే వైద్యుడికి దూరంగా ఉండవచ్చనే నానుడి మధుమేహం విషయంలోనూ సరైనదే అంటారు వైద్య నిపుణులు. యాపిల్‌లో ఫైబర్ అధికంగా ఉండటంతో ఇది మధుమేహంతో బాధపడేవారికి మేలు చేస్తుంది. యాపిల్ తీసుకోవడంతో శరీరంలో తక్షణమే బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగవు.అయితే మితంగా తీసుకుంటే దీని సత్ఫలితాలు పొందవచ్చు. ఇక యాపిల్‌తో పాటు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన జామ పండ్లను తీసుకోవచ్చు. తొక్క తీసి జామ పండ్లను తీసుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. యాపిల్, జామతో పాటు మధుమేహులు ఆరెంజ్, కివీ పండ్లను తీసుకోవచ్చు. మరోవైపు మధుమేహంతో బాధపడేవారు మామిడి, లిచి, ద్రాక్ష, అరటి పండ్లకు దూరంగా ఉండాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY, # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printed at: GARUDA PRINT-ERS, # H.No.2-86/1, Plot No.23-SP, SyNo.417, Sagar Highway, Ranganaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510. Telangana. Published at: # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District. 501511. Telangana....www.arunaprabha.com.email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889.